జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php



చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523



సంపుటి 5 సంచిక 35 | హైదరాబాద్, నవంబరు 25 గురువారం 2021 | 8 పేజీలు | వెల : 5.00





## హరితహారం కాదు.. వేప చెట్లను కాపాడండి

హైదరాబాద్,నవంబరు 24, ప్రజాపాలన ప్రతినిధి: వేప చెట్లు ఉన్నట్టుండి ఎండిపోతున్నాయి. ఒకట్రెండు చెట్లు కాదు.. ఊర్లో ఉన్న చెట్ల ఆకులన్నీ మాడిపోతున్నాయి. దీంతో ప్రజల్లో ఆందోళన మొదలైంది. చెట్లకు ఏదో వైరస్ సోకిందన్న ప్రచారం సోషల్ మీడియాలో జోరందుకుంది. దీంతో జనం మరింత వణికిపోతున్నారు. చూస్తుండగానే ఆకులు మాడిపోవడం, వేర్లు కూడా ఎండిపోతుండటం, కొన్ని రోజుల్లోనే చెట్టు చచ్చిపోతుండటం.. భయానికి కారణమవుతోంది. డై బ్యాక్ డిసీజ్ అని కొందరు చెబుతోంటే, టీ మస్కిటో బగ్ కారణమని మరికొందరు చెబుతున్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న ఫ్యాక్టరీల కారణంగా కూడా చెట్లకు మాడిపోతున్నాయని మరికొందరు నిపుణులు చెబుతున్నారు. ఇంతకీ.. వేప చెట్లు ఎందుకు మాడిపోతున్నాయి..? జనంలో ఉన్న ఆందోళనలేంటీ..? ఇప్పుడు చూద్దాం. వేపాకు, వేపపూత ఇలా వేప చెట్టు నుంచి వచ్చే ప్రతి భాగం కూడా మనిషి ఆరోగ్యానికి ఉపయోగపడతాయి. వేపను ఆయుర్వేద శాస్త్రం చింతామణి, సర్వరోగ నివారిణి అంటుంటారు. కానీ ఇప్పుడా వేపచెట్టుకే నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రమాదం ముంచుకొచ్చింది. నాగర్ కర్నూల్ జిల్లా బిజినాపల్లి, నాగర్ కర్నూల్ ,తిమ్మాజీపేట, తాడూర్, తెలకపల్లి మండలాల్లో కొన్ని రోజులుగా వేప చెట్లు ఎండిపోతున్నాయి. మొదట చెట్టు కొనలు కాలిపోయినట్టుగా మారి తర్వాత మోడువారుతున్నాయి. వేపచెట్లు ఎండిపోవటం ఎప్పుడూ చూడలేదని గ్రామాల్లోని పెద్దవాళ్లు చెబుతున్నారు. పొద్దున వేప పుల్లతో పండ్లు తోమడం దగ్గర నుంచి ఆయుర్వేదంలో వేపాకు, పూత, బెరడుకు చాలా ప్రాధాన్యత ఉంది. డయాబెటిస్ నివారణలోనూ వేపను వాడతారు. పండుగలు, పూజలకు వేప కొమ్మలను గుమ్మాలకు కడతారు. ఇండ్లలో దోమల నివారణకు, పంటలపై చీడ పీడలు వదిలించేందుకు వేపాకు రసాన్ని పిచికారీ చేస్తారు. ఇన్ని ప్రయోజనాలు ఉన్న వేపచెట్లు ఎండిపోవడం బాధగా ఉందంటున్నారు గ్రామాల్లోని పెద్దలు.వేప చెట్లకు డై బ్యాక్ తెగులు సోకుతోంది. ఇది పోమప్సస్ అజిడిరక్టే అనే శిలీంద్రం ద్వారా వస్తుంది. కర్ణాటకలో 1997లో సతీష్ అనే శాస్త్రవేత్త పరిశోధన బృందం గుర్తించింది. ఈ వ్యాధి వేప చెట్టు ఎత్తు, వయసుతో సంబంధం లేకుండా వస్తుంది. కొమ్మలపై ఆకులు, పూతపై మచ్చలు రావడం, వేప పండ్లు కుళ్ళి పోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ బ్లైట్ తెగులు నివారణకు బావిస్టన్ అనే మందు బాగా పని చేస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ శిలీంద్రం విత్తనాల ద్వారానే వస్తున్నందున నర్సరీల్లో మొక్కలు పెంచేటప్పుడే విత్తనశుద్ధికి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. (మిగతా 2లో..)

## సాగు చట్టాల రద్దు బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం



న్యూఢిల్లీ,నవంబరు 24 ప్రజాపాలన ప్రతినిధి: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించినట్లుగా కొత్త సాగు చట్టాలను రద్దు చేసే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ మూడు చట్టాలను రద్దు చేసేందుకు ఉద్దేశించిన బిల్లుకు కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. కేబినెట్ సమావేశం అనంతరం సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ మీడియాతో మాట్లాడుతూ, మూడు సాగు చట్టాల రద్దుకు కేబినెట్ అధికారికంగా ఆమోదం తెలిపిందని చెప్పారు. దీనికి సంబందించి ప్రధాని మోదీ ఈ నెల 19న ఓ ప్రకటన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నవంబరు 29 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. సమావేశాల తొలి రోజు నుంచే ఈ ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. మోదీ ఇచ్చిన మాటను ఐదు రోజుల్లోనే నెరవేర్చారన్నారు. బుధవారం కేబినెట్ సమావేశం ఎజెండాలో ఈ అంశం లేదని చాలా మంది పాత్రికేయులు చెప్తున్నారని ఆరోపించారు. ఈ చట్టాలను రద్దు చేయాలని దాదాపు 40 రైతు సంఘాలు ఓ సంవత్సరం నుంచి డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 19న జాతిని ఉద్దేశించి మాట్లాడుతూ, ఈ చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. రైతులకు మేలు కలిగించే ఈ చట్టాలపై ప్రజలకు నచ్చజెప్పడంలో విఫలమయ్యామని చెప్తూ, ప్రజలను క్షమాపణ కోరారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కోసం నూతన నిబంధ,ˇ ఌా వళి ని రూపొందించేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు.

## మార్చి వరకు ఉచిత రేషన్



న్యూఢిల్లీ: కేంద్రం శుభవార్త చెప్పింది. ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎం–జీకేఏవై) పథకం కింద ఇస్తున్న ఉచిత రేషన్ స్కీమ్‌ను వచ్చే ఏడాది వరకూ పొడిగిస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర కేబినెట్ బుధవారంనాడు నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని కేద్ర మంత్రి అనురాగ్ ఠాగూర్ మీడియాకు తెలిపారు. గత ఏడాది కోవిడ్ మహమ్మారి తీవ్రం కావడంతో ప్రజల ఆర్థిక కష్టాలను దృష్టిలో ఉంచుకుని పీఎంజీకేఏవై స్కీమ్ కింద ఉచిత రేషన్ అందజేస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. కాగా, ఇటీవల పరిస్థితులు తిరిగి మెరుగుపడటంతో నవంబర్ 30వ తేదీ నుంచి ఉచిత రేషన్ పంపిణీని నిలిపివేయనున్నట్టు గత నవంబర్ 5న ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో పథకాన్ని పొడిగించాలని 'రైట్ టు ఫుడ్' కార్యకర్తలు సహా పలు పార్టీలు కేంద్రానికి విజ్ఞప్తి చేశాయి. వీటిని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర క్యాబినెట్ వచ్చే ఏడాది మార్చి వరకూ పథకాన్ని పొడిగిస్తూ తాజాగా నిర్ణయం తీసుకుంది.



## మొక్కు చెల్లించుకున్న ఈటల

హైదరాబాద్,నవంబరు 24, ప్రజాపాలన ప్రతినిధి:రాష్ట్రంలో చివరి గింజదాక కొంటానని రైతులను కేసీఆర్ మోసం చేశారన్నారు.. హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్. ప్రభుత్వం మెడలు వంచి వడ్లు కొనేలా చేస్తామన్నారు. డిసెంబర్ 10 తర్వాత గ్రామ గ్రామన పర్యటిస్తానన్నారు ఈటల. కమలాపూర్ మండలం బత్తినవానివల్లి హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు ఈటల. ఎన్నికలకు ముందు నిర్వహించిన పాదయాత్ర టైమ్ లో కట్టిన ముడుపు మొక్కు చెల్లించుకున్నారు.



## స్వీడన్ మొదటి మహిళా ప్రధానిగా మగ్దలేనా అండర్సన్

స్వీడన్, నవంబరు 24, ప్రజాపాలన ప్రతినిధి: స్వీడన్ ప్రధానిగా సోషల్ డెమోక్రాట్స్ నాయకురాలు మగ్దలేనా అండర్సన్ ఎంపికయ్యారు. బుధవారం స్వీడన్ పార్లమెంట్‌లో జరిగిన ఓటింగ్‌లో మగ్దలినాకు మెజారిటీ ఓట్లు వచ్చాయి. దాంతో ఆమె ప్రధానిగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ విజయంతో మగ్దలేనాకు మరో ఘనత కూడా దక్కింది. స్వీడన్ దేశానికి ప్రధానిగా ఎంపికైన తొలి మహిళగా ఆమె ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్నారు. 2022లో స్వీడన్‌లో సాధారణ ఎన్నికలు జరుగనున్నాయి. తన తర్వాత కాబోయే ప్రధానికి ఈ ఎన్నికల సన్నద్ధత కోసం తగినంత సమయం ఇవ్వాలనే ఉద్దేశంతో స్వీడన్ ప్రధాని స్టీఫన్ లోఫ్‌వెన్ ఈ నెల 10న పదవికి రాజీనామా చేశారు. ఆయన గత ఏడేండ్లుగా స్వీడన్ ప్రధానిగా పనిచేశారు. ఈ నెల ప్రారంభంలో స్టీఫన్ లోఫ్‌వెన్ ప్రధాని పదవి నుంచి తప్పుకోనున్నట్లు ప్రకటించారు. దాంతో వెంటనే ఆ దేశ ఆర్థిక మంత్రిగా ఉన్న మగ్దలేనా అండర్సన్‌ను సోషల్ డెమోక్రాట్స్ నాయకురాలిగా ఎన్నుకున్నారు.

## ఢిల్లీ నుండి అయోధ్యకు ఫ్రీ జర్నీ



ఢిల్లీ,నవంబరు 24, ప్రజాపాలన ప్రతినిధి: సీఎం అరవింద్ కేజ్రీవాల్ మరో కీలక స్కీంను ప్రకటించారు. 60 ఏళ్లకు పైబడిన వారి కోసం ముఖ్యమంత్రి తీర్థయాత్ర యోజన పథకాన్ని తీసుకొచ్చింది. 60 ఏళ్లు నిండిన వ్యక్తులు ఢిల్లీ నుంచి దేశంలోని వివిధ పుణ్యక్షేత్రాలకు వెళ్లి వచ్చేందుకు టికెట్లను ఫ్రీగా అందించనుంది. దీని కోసం ఢిల్లీ సర్కార్ ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. అయితే.. కరోనా కారణంగా ఇప్పటి వరకు ఈ పథకం అమలు కాలేదు. ఇప్పుడు డిసెంబర్ 3 వ తేదీ నుంచి ఈ పథకం అమలు కానుంది. డిసెంబర్ 3 వతేదీన ఢిల్లీ నుంచి అయోధ్యకు మొదటి రైలు బయలుదేరబోతున్నది. సుమారు 1,000 మంది ప్రయాణికులతో ఈ రైలు అయోధ్యకు ప్రయాణించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ పథకం ద్వారా రైల్లో ప్రయాణించేవారికి సంబంధించి మార్గదర్శకాలు, పథకానికి ఎలా ధరఖాస్తు చేసుకోవాలి తదితర విషయాలను ఇప్పటికే ఢిల్లీ సర్కార్ రిలీజ్ చేసింది. 60 ఏళ్లు నిండిన భార్యభర్తలతో పాటుగా, వారికి తోడుగా 21 ఏళ్లు కంటే తక్కువ వయసున్న ఒకరిని తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఢిల్లీ నుంచి దేశంలో ఎక్కడెక్కడికి ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది..ఎన్ని రోజులు ప్రయాణం చేసేందుకు అవకాశం ఉంటుంది అనే విషయాలను ఇప్పటికే కేజ్రీవాల్ ప్రభుత్వం రిలీజ్ చేసింది.

## రాష్ట్రంలో.. పెరుగనున్న చలితీవ్రత



హైదరాబాద్ : తెలంగాణలో ఈ నెల 27 వరకు పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అయితే, మంగళవారం దక్షిణ మధ్య బంగాళాఖాతంలో ఉన్న ఉపరితల ఆవర్తనం బుధవారం నైరుతి పరిసర ప్రాంతాల్లోని ఆగ్నేయ బంగాళాఖాతంలో సముద్ర మట్టానికి 4.5 కిలో మీటర్ల ఎత్తు వరకు వ్యాపించి ఉన్నదని చెప్పింది. దీని ప్రభావంతో రాగల 24 గంటల్లో నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి, పశ్చిమ– వాయువ్య దిశగా కదిలి శ్రీలంక, దక్షిణ తమిళనాడు తీరానికి చేరుకునే అవకాశం ఉందని పేర్కొంది.అలాగే రాష్ట్రంలోకి కింది స్థాయి గాలులు ఈశాన్య దిశనుంచి గంటకు 8 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో వీస్తున్నాయని తెలిపింది. రాష్ట్రంలో పొడివాతావరణం ఏర్పడడంతో రాగల మూడు రోజుల్లో ఆదిలాబాద్, సంగారెడ్డి కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 14 నుంచి 15 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయే అవకాశం ఉందని టీఎస్‌డీపీఎస్ అంచనా వేసింది. ఇదిలా ఉండగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు అత్యల్పంగా కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యూ)లో 18.6, ఖమ్మం జిల్లా పమ్మిలో అత్యధికంగా 37.5 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని టీఎస్ డీపీఎస్ పేర్కొన్నది. జీహెచ్ఎంసీ పరిధిలోని సెంట్రల్ యూనివర్సిటీలో కనిష్ఠంగా 19.1 డిగ్రీలు, షాపూర్‌నగర్‌లో 35.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు చెప్పింది. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలో నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, హన్మకొండ, భద్రాద్రి కొత్తగూడెం మినహా మిగిలిన అన్ని జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయని తెలిపింది. రాష్ట్రంలో అత్యధికంగా సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం ముకుందాపురం 9.05, మంచిర్యాల జిల్లా కాసిపేటలో 8.42, సూర్యాపేట జిల్లా నూతనకల్ 6.73, పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లో 4.28 సెంటీమీటర్ల వర్షాపాతం నమోదైందని వివరించింది.


అంబేడ్కర్ టీవీ @ మాస్టర్ కీ టీవీ



గౌతమబుద్ధుడు, జ్యోతిరావుఫూలే, డా.బీ.ఆర్. అంబేడ్కర్
వారి ఫోటలను టీవీ స్క్రీన్ పై 24/7చూపిస్తూ.

బహుజన భావజాలాన్ని, వార్తలను,
భారత దేశంలో ప్రసారం చేస్తున్న
ఏకైక ఛానల్స్,
మాస్టర్ కీ టీవీ,(అంబేడ్కర్ టీవి ఛానల్స్ )

చేయి చేయి కలుపుదాం
బహుజన భావజాలాన్ని విస్తరిద్దాం..
బహుజన రాజ్యాధికారాన్ని సాధిద్దాం..!

డా.కె శివ భాగ్యారావు బహుజన్ IRS-vrs
మాస్టర్ కీ టీవి ఛానల్ చైర్మన్

# వరి ధాన్యం వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి

## కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ఎమ్మార్వోకి వినతి పత్రం




కోరుట్ల, నవంబర్ 24 (ప్రజాపాలన ప్రతినిధి): పిసిసి పిలుపు మేరకు రాష్ట్రంలో వరి ధాన్యం పంటను మద్దతు ధరలు ఇచ్చి పూర్తి స్థాయిలో కొనుగోలు చేసి వెంటనే చెల్లింపులు చేసి రైతులను ఆదుకోవాలని తహశీల్దార్ కి వినతి సమర్పించారు. ఈ సందర్భగా కాంగ్రెస్ పార్టి రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో వరి ధాన్యం పండించిన రైతుల పరిస్థితి ఆత్యంత దయనీయంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు బాధ్యతలు మాది కాదు అంటే మాది కాదు అంటూ పట్టించుకోకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రాష్ట్రంలో 62 లక్షల ఎకరాల్లో వరిసాగు అయ్యిందని ప్రభుత్వం చెబుతోంది. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరల జాబితాలో 23 పంటలతో పాటు వరి పంట కూడా ఉంది..మద్దతు ధర ప్రకటించడం అంటేనే ప్రభుత్వం కొనుగోలు చేయడం అని అర్థం. అందువల్ల రైతులు పండించిన వరి ధాన్యం పంటలను ప్రభుత్వం ఖచ్చితంగా కొనుగోలు చేయాలి.కానీ రాష్ట్రంలో పంట ఎంత వస్తుంది, ఎప్పుడు వస్తుంది అన్న వివరాలు ప్రభుత్వం వద్ద లేవుముందస్తు ప్రణాళిక లేకుండా ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని 62 లక్షల ఎకరాలలో వరి వేశారనికోటి క్వింటాళ్లు ఉత్పత్తి వస్తుందని ప్రభుత్వ అంచనాలు ఉన్నాయి.పంట చేతికి వచ్చి నెల రోజులు అవుతున్న ప్రభుత్వం కేవలం 11 లక్షల క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసింది.రాష్ట్రంలో ఐకెపి, సహకార సంఘాల ద్వారా 6,772 కొనుగోలు కేంద్రాలు తెరవాల్సి ఉండగా కేవలం 4, 743 కేంద్రాలు పేరు కు ఓపెన్ చేశారు.. ఇందులో సగం కూడా కొనుగోళ్లు చేయడం లేదు.పౌర సరఫరాల మంత్రి గంగుల కమలాకర్, వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి నియోజక వర్గాల్లో కూడా అంతంత మాత్రమే కొనుగోళ్లు జరిగాయి. కొనుగోలు జరిగిన ధాన్యానికి కూడా 2,100 కోట్ల రూపాయలు చెలించాల్సి ఉండగా, కేవలం 116 కోట్లు మాత్రమే ఇప్పటి వరకు చెల్లించారు.లక్షల క్వింటాళ్ల ధాన్యం నేడు కల్లాలల్లో, రోడ్లపైనే ఉండి పోయి వర్షానికి తడిసి పాడైపోయింది. అలాగే ధాన్యం వరదలకు కొట్టుకుపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే ధాన్యం కొనుగోల్లలో జాప్యం, వరదల నష్టాల తదితర సమస్యలతో అన్నదాతలు గుండెపోట్ల తో కొందరు, ఆత్మహత్య లు చేసుకొని కొందరు, పాము కాట్లతో అసువులు బాసారు. స్వయంగా మంత్రి కేటీఆర్ నియోజక వర్గంలో నిన్న ధాన్యం వర్షంలో కొట్టుకుపోవడంతో ఎల్లారెడ్డి పేట మండలం అక్కపల్లి గ్రామంలో రైతు ఆత్మహత్య చేసుకున్నారు. అలాగే కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం లో బీరయ్య అనే రైతు రోజుల తరబడి ధాన్యం అమ్మలేక మార్కెట్ లోనే కుప్ప మీద పడి చనిపోయాడు. బాన్సువాడ మండలం హన్మజిపేట లో రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేనుకున్నారు. మార్కెట్లలో రోజుల తరబడి అమ్మకాలు జరగకపోవడంతో రైతులు విసిగి వేసారి ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరలకు అమ్ముకుంటున్నారు. దీంతో రైతులకు పెట్టుబడులు కూడా గిట్టుబాటు కావడం లేదు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధాన్యం కొనుగోళ్ళకు శాస్త్రీయత లేకుండా అగమ్యగోచరంగా మార్చారు.రైతులకు డబ్బులు చెల్లించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది, 25 రోజులైనా చెల్లింపులు కావడంలేదు.అలాగే తరుగు పేరుతో రైతులను మిల్లర్లు దోచుకునే కార్యక్రమాన్ని మళ్ళీ మొదలు పెట్టారు.కౌలు రైతులు పండించినవరి ధాన్యం కోనడం లేదు భూమి ధ్రువీకరణ పత్రాలు కావాలంటూ కొనుగోళ్ళు చెయ్యడం లేదు.మిల్లర్ల దోపిడీకి రైతులు గురి కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి, తూకం పట్టి ఆధారంగా రైతులకు డబ్బులు చెల్లించాలి.50 లక్షల ఎకరాల్లో రబీలో సాగవుతుందని ప్రభుత్వ అంచనారబీలో వరి సాగు వద్దని చెబుతున్న ప్రభుత్వం, ప్రత్యామ్నాయ పంటలకు చెంది ప్రణాళిక లేదు.వరి పండే భూముల్లో ఇతర పంటలు పండించడం చాలా కష్టం.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖిరితో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. రాష్ట్రంలో వ్యవసాయ విధానం లేకపోవడంతో రైతులను అయోమయానికి గురవుతున్నారు.ఈ పరిస్థితులలో అధికారంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయం ప్రయోజనాలకై వీదిన పడడం పంట పండించిన రైతును అయోమయంలో పడేస్తుంది.ఈ పరిస్థితి రావడానికి రాష్ట్రంలో కేసీఆర్, కేంద్రంలో మోడీ బాద్యులు.ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి రాష్ట్రంలో రైతుల వద్ద ఉన్న మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలి, ధాన్యం కొనుగోలు చేయగానే వీరికి సకాలంలో డబ్బులు చెల్లించాలి. భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి. రాబోయే రోజుల్లో సమగ్ర వ్యవసాయ విధానం అమలు చేసి ధాన్యం రైతులకు భరోసా కల్పించాలని, మరణించిన రైతు కుటుంబాలకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ పక్షాన జువ్వాడి కృష్ణారావు గారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు ఈ సందర్భంగ మండల రెవిన్యూ అధికారి గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొంతం రాజం మాజీ మార్కెట్ కమిటి ఛైర్మెన్ బోయినిపల్లి సత్యంరావు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ జిల్లా కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు ఏలేటి శేషేంధర్ రెడ్డి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్ పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సొగ్రాబి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు పసుల కృష్ణప్రసాద్ పట్టణ కిసాన్ సెల్ అధ్యక్షులు శ్రీరాముల అమరేందర్ మండల కిసాన్ సెల్ అధ్యక్షులు బొల్లె నర్సయ్య ఎస్సీసెల్ మండల అధ్యక్షులు మంథని గంగనర్స య్య పట్టణ ఉపాధ్యక్షులు ఏం ఏ నయీమ్, పట్టణ కార్యదర్శి వ్యాకల నర్సయ్య, ఎంబేరిసత్యనారాయణ,మండల ప్రధాన కార్యదర్శి కట్టేకొల రమేష్, నజ్జు షకీల్ ,తుపాకుల బాజన్న, సరికెల నరేష్ , వెంకటేష్ ,నర్సయ్య ,పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు కూలీల కరువు



అదిలాబాద్, నవంబర్ 24, :పత్తి రైతును కూలీల కొరత వేధిస్తున్నది. చేతికొచ్చిన పంటను తీసే సమయంలో కూలీలు దొరకక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. అడిగినకాడికి చెల్లిస్తూ, ఇతర గ్రామాల నుంచి కూలీలను తీసుకు వస్తున్నారు. యదాద్రి భువనగిరి, జనగాం జిల్లాల్లో మన తెలంగాణ ప్రతినిధి క్షేత్ర పరిశీలనకు వెళ్లగా పత్తితీతకు కూలీల కొరత అధికంగా ఉన్నట్లు వెల్లడైంది. వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని తద్వారా కూలీల కొరత తీరుంతుందని తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేశారు. రైతులు కూడా ఇదే కోరుతున్నారు. అయితే ఈ విషయంలో కేంద్రం ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో అన్నదాతలు ఆర్థికంగా నష్టపోతున్నారు. మిగతా పంటల మాదిరి పత్తి తీసేందుకు అనుకూలమైన యంత్రాలు అందుబాటులో లేకపోవడం ఒక కారణం. ఈ ఖరీఫ్ లో రాష్ట్రవ్యాప్తంగా 46 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగైంది. గులాబీ రంగు పురుగుతో, ఇటీవల కురిసిన వర్షాలకు పంట దెబ్బతినగా ఇప్పుడు మిగిలిన పత్తిని తీయడానికి రైతులు కూలీల కొరతతో కష్టాలు పడుతున్నారు. ఒకరిద్దరు కూలీలు దొరికినా ఒక్కో కూలీకి రోజుకు రూ. 300లు ఆపైన ఇవ్వాల్సి వస్తోందని వాపోతున్నారు. మరికొందరు కూలీలు కిలో లెక్కన పత్తితీతకు డబ్బు అడుగుతుండడంతో పంటపై వచ్చే లాభం కన్నా కూలీలకే ఎక్కువ చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి చోటా కూలీల కొరత వేధిస్తుండడంతో స్థానికంగా ఉన్న కొద్దిమంది ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం దూరప్రాంతాలకు వెళ్లి పనులు చేస్తున్నారు. ఏ మండలంలో కూలీ డబ్బులు ఎక్కువ చెల్లిస్తే అక్కడకు వెళ్తున్నారు. ఫలితంగా పత్తి తీతకు కొంతకాలం వేచిచూసే అవకాశం కూడా లేకుండా పోయిందని, ఇంటివారమే తీసుకోవాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. వర్షాలకు తడిచిన పత్తికి క్వింటాలుకు రూ. 3600 ధర వస్తుంటే అందులో కూలీల చెల్లింపులే రూ. 2 వేల వరకు ఇవ్వాల్సి వస్తోందంటున్నారు. కొందరు రైతులు 15, 20 రోజుల ముందే ముందస్తు చెల్లింపులు చేసి కూలీలను సమాయత్తం చేస్తున్నారు. తెల్లవారు జామున 4 గంటలకే ఆటోలో కిక్కిరిసి పంలపొలాలకు తీసు కెళ్తున్నారు. మధ్య తరగతి రైతులు కూలీల కొర తతో కొందరు కుటుంబ సభ్యులు రోజుకు కొంత తీసుకుంటున్నారు. కుటుంబ సభ్యులు తక్కువగా ఉన్న రైతులు కూలీలకు అధిక కూలీ చెల్లించలేక భార్యాభర్తలు నిత్యం కొంత తీసుకుంటున్నారు. కూలీలు కూడా రోజుకు ఇంత అని కాకుండా కిలో పత్తి తీసేందుకు రూ. 8 నుంచి రూ. 10 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అందుకు రైతులు కూడా అంగీకరించక తప్పడం లేదు. ఒక ఎకరా పొలంలో పత్తి తీసేందుకు 12 మంది కూలీలు అవసరమవుతారు. అంతమంది కూలీలు దొరకక రైతులు కుటుంబసభ్యులతో పాటు దగ్గర ఊర్లలో ఉండే బంధువులను కూడా పిలిపించుకొని పని పూర్తి చేసుకుంటున్నారు. ఆర్టిసి సమ్మె నేపథ్యంలో వారం సెలవులు పొడిగించిన తరువాత పాఠశాలలు పునఃప్రారంభం అయినప్పటికీ బస్సులు అందుబాటులో ఉండకపోవడంతో ఎక్కువ మంది పిల్లలు బడికి పోవడం లేదు. దీంతో కొందరు రైతులు పిల్లలను కూడా పొలం పనికి తీసుకెళ్తున్నారు. మొత్తం మీద గడచిన ఇరవై రోజులలో ఒక వైపు యాసంగి విత్తనాలు వేయడం, మరో వైపు పత్తి తీయడం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సమయంలో అప్పుడప్పుడు ముసురు వర్షాలు కురుస్తుండడంతో పత్తి నల్లబారుతుందన్న ఆందోళనతో రైతులు కుటుంబసభ్యులు, పిల్లలతో కలిసి పత్తి తీసే పనిలో నిమగ్నమయ్యారు. ఏడేనిమిది ఏండ్ల కింద కూలీకి వస్తమని అనే అడిగేవాళ్లు. అప్పట్లో పొలం కాడికి వచ్చినోళ్లను కూడా వెనక్కి పంపినం కొన్నిసార్లు. ఇప్పుడు కూలీలు కావాలని ఊరంతా తిరిగినా ఎవరూ వస్తలేరు. ఈ రోజు నాకొస్తే రేపు నీకొస్త అన్ని ఒప్పందంతో కూలీ పనులకు వెళ్తున్నారు. కూలీ డబ్బును కూడా అధికంగా చెల్లించాల్సి వస్తోంది.



## ఆటలపోటీలలో విజేతలకు బహుమతి ప్రధానం చేసిన జియం చింతల శ్రీనివాస్

మందమర్రి నవంబర్ ప్రజాపాలన ప్రతినిధి: మందమర్రి ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యలయంలోని కాన్ఫరెన్స్ హాల్ల్ సింగరేణి లోకి నూతనంగా 23మందికి కారుణ్య డిపెండెంట్ లకు ఉద్యోగాల నియామకాల ఉత్తర్వుల పత్రాలను జియం చింతల శ్రీనివాస్ అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందమర్రి ఏరియాలో 1171 కారుణ్య పత్రాలను అందజేయడం జరిగిందని కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న ఉద్యోగులు సర్ఫేస్ లో లైట్ జాబ్ కోసం ప్రయత్నం చేయకుండా 4,5, సంవత్సరాలు అండర్ గ్రౌండ్ లో పని చేయాలని అన్నారు. అలాగే నాగాలు చేయకుండా ఉద్యోగం చేసుకోవాలని అన్నారు. తమ విదులను సక్రమంగా నిర్వహిస్తు సింగరేణి లాభాల బాల లో తీసుకురావడానికి కృషి చేయాలని అన్నారు. సింగరేణి సంస్థ నిర్దేశించుకున్న ఆశాయాలను లక్ష్యాలను నెరవేర్చాలని క్రమశిక్షణతో ఉద్యోగ ధర్మాన్ని పాటించి వృద్దిలోకి రావాలని కోరారు. దేశంలో ఏ బొగ్గు పరిశ్రమలో కారుణ్య నియామకాలు కొనసాగడం లేదని మన ముఖ్యమంత్రి కేసిఆర్ కృషితో ఈ కారుణ్య నియామకాలు జరుగుతున్నాయిని అయన అన్నార. రెండవ తరానికి ఈ అవకాశం రావడం అదృష్టంగా భావించి ఉద్యోగన్ని దైవంగా బావించి సక్రమంగా విదులు నిర్వహించాలని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో పియం వరప్రసాద్, ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ ఎస్ సత్యనారాయణ, టిబిజికెఎస్ నాయకుడు దామోదర్ డివై పియం ఎస్ శ్యామ్ సుందర్, సీనియర్ పిఒ మైత్రే య బందు, ఒఎస్ రాయలింగు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## హరితహారం కాదు.. వేప చెట్లను కాపాడండి

(మొదటి పేజీ తరువాయి)

పొలెంలోని వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో ఉన్న సైంటిస్టులు మాత్రం వేపచెట్లు ఎండిపోవడం తమకు తెలియదంటున్నారు. పరిశోధన చేస్తామంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం హరితహారం కోసం కోట్ల రూపాయలు ఖర్చు పెడుతోంది. కానీ ఉన్న చెట్లను పట్టించుకోవట్లేదంటున్నారు జనం.

## నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కవిత ఏకగ్రీవం



హైదరాబాద్ : సీఎం కేసీఆర్ కూతురు, సిటింగ్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మరోసారి ఎమ్మెల్సీ అయ్యారు. నిజామాబాద్ జిల్లా స్థానిక సంస్థల అభ్యర్థిగా మళ్లీ పోటీ చేసిన ఆమె ఎన్నిక ఏకగ్రీవమైంది. స్వతంత్ర అభ్యర్థి శ్రీనివాస్ నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరించడంతో కవితకు లైన్ క్లియర్ అయ్యింది. మంగళవారం ఆమె నామినేషన్ దాఖలు చేయగా.. ఒక్కరోజు గ్యాప్‌లోనే ఎమ్మెల్సీగా కవిత ఏకగ్రీవమైనట్లు ప్రకటన వచ్చేసింది.కాగా.. కవిత ప్రస్తుత మండలి సభ్యత్వం త్వరలో ముగియనుండగా.. మళ్లీ ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు ఆమె ఆసక్తి చూపడంలేదనే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఇటీవల రాజ్యసభ సభ్యుడు బండా ప్రకాష్‌ను ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా సీఎం కేసీఆర్ ఖరారు చేయడంతో.. ఆయన స్థానంలో కవితను ఢిల్లీకి పంపిస్తారనే ఊహాగానాలు వెలువడ్డాయి. ఇందుకు తగ్గట్టుగానే నిజామాబాద్ స్థానానికి సిటింగ్ ఎమ్మెల్సీ ఆకుల లలిత పేరు వినిపించింది. కానీ, టీఆర్ఎస్ అధిష్ఠానం ఊహాగానాలకు తెరదించుతూ.. నిజామాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మళ్లీ కవిత పేరునే ఖరారు చేసింది.

## మొలకలెత్తుతున్న ధాన్యం

ఖమ్మం, నవంబర్ 24, :రుగాలం పండించిన పంట వర్షానికి తడిసి కొనుగోలు కేంద్రాల్లోనే మొలకెత్తి నారుగా మారుతోంది. అసలే అరకొర కొనుగోళ్లు చేపట్టిన అధికారులు.. వారం రోజులుగా రోజూ వర్షాలు వస్తుండటంతో కాంటాలు ఆపేశారు. దాంతో నెల రోజులుగా ధాన్యాన్ని తీసుకొచ్చి ఎదురుచూస్తున్న రైతులు రాత్రింబవళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక వైపు అధికారుల నిర్లక్ష్యం.. మరోవైపు ప్రకృతి కన్నెర్ర.. వెరసి రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి. ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో ధాన్యం కుప్పలు నెల రోజుల నుంచి అలాగే ఉండిపోయాయి. సూర్యాపేట జిల్లాలో 11,26,848 మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా వేయగా, ఇప్పటి వరకు 6,402 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లాలో 5 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా, ఇప్పటి వరకు 14,315 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. నల్లగొండ జిల్లాలో 11,3,427 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా, ఇప్పటి వరకూ లక్షా 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు నెల రోజుల కిందటే ధాన్యం నిల్వలు పోశారు. వారం రోజులుగా ప్రతి రోజూ వర్షం పడుతుండటంతో అధికారులు కొనుగోళ్లను నిలిపేశారు. అయితే, ధాన్యం తడవకుండా ఉండేందుకు అవసరమైన టార్ఫాలిన్లు లేకపోవడంతో ప్రయివేటుగా అద్దెకు తీసుకొచ్చి ధాన్యం కుప్పలపై కప్పుతున్నారు. అయినా తడవకుండా రక్షించుకోలేకపోతున్నారు. ఒక్క టార్ఫాలినుకు రోజుకు రూ. 20 నుంచి రూ. 30 వరకు అద్దె వసూలు చేస్తున్నారు. ఇలా ఒక రైతు కనీసం 10 టార్ఫాలిన్లను ఉపయోగించుకుంటున్నారు. అంటే రోజుకు సుమారు రూ. 300 వరకు ఖర్చు చేస్తున్నట్టు లెక్క. అయినా రాసుల కుప్పల కింద వర్షపు నీరు చేరి ధాన్యం పూర్తిగా తడస్తోంది. కుప్పలపైన బాగానే ఉన్నట్టు కనిపిస్తున్నప్పటికీ అడుగు భాగంలో పూర్తిగా తడిచి మొలకెత్తుతోంది. వడ్ల కుప్పపైనే పచ్చటి గడ్డి మొలకల మాదిరిగా కనిపిస్తున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఏ మార్కెట్‌లో చూసినా ఇలాగే ఉంది

## థియేటర్లలో మళ్లీ పార్కింగ్ దందా

హైదరాబాద్, నవంబర్ 24, :థియేటర్ల (సింగిల్ స్క్రీన్)లో ద్విచక్ర వాహనాలకు రూ. 20, నాలుగు చక్రాల వాహనాలకు రూ. 30ల చొప్పున పార్కింగ్ రుసుము వసూలు చేయొచ్చు. మాల్స్, మల్టీప్లెక్స్, ఇతర వాణిజ్య సముదాయాల్లో పాత నిబంధనలే వర్తిస్తాయి' అని జులై 20న పురపాలక శాఖ ఉత్తర్వులు జారీచేసింది. కానీ ఉత్తర్వుల సాకుతో జీహెచ్ఎంసీ పరిధిలోని మాల్స్, మల్టిఫెక్స్‌లు పార్కింగ్ ఫీజును వసూలు చేస్తున్నాయి. దీంతోపాటు థియేటర్లలోనూ నిర్దేశించిన వాటికంటే అధిక ఫీజు వసూలు చేస్తున్నారని జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, డిజాస్టర్ మెనేజ్‌మెంట్ (ఈవీడీఎం), సెంట్రల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సెల్ (సీఈసీ) ట్విట్టర్ ఖాతాకు ఫిర్యాదులు వస్తున్నాయి. అయితే ఫిర్యాదులు వచ్చినా అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలూ లేకపోలేదు. పైగా ట్విట్టర్‌లో అడ్వర్‌టైజ్‌మెంట్, హోర్డింగ్‌ల విషయంలో చురుకుగా వ్యవహరిస్తున్న జీహెచ్ఎంసీ ఈవీడీఎం, సెంట్రల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సెల్ (సీఈసీ) పార్కింగ్ ఫీజు ఫిర్యాదులపై ఎందుకు స్పందించడం లేదని నగరవాసులు మండిపడుతున్నారు. ప్రభుత్వం జీఓ జారీచేసిన తర్వాత మాల్స్, మల్టిప్లెక్స్‌లో అధికారులు తనిఖీలు చేసిన దాఖలేవని విమర్శిస్తున్నారు.గ్రేటర్‌లో పార్కింగ్ మాఫియాను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మూడేండ్ల క్రితం ఉచిత పార్కింగ్‌కు అవకాశం కల్పిస్తున్నట్టు ప్రకటించింది. థియేటర్లు, మాల్స్, మల్టీప్లెక్స్‌ల్లో పార్కింగ్ ఫీజు వసూలు చేయకూడదని 20 మార్చి 2018న పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉచిత పార్కింగ్ నిబంధనలను ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మాల్స్, మల్టీప్లెక్సుల్లో మొదటి 30 నిమిషాలు కొనుగోళ్లతో సంబంధం లేకుండా ఉచిత పార్కింగ్‌కు అవకాశముంటుంది. 30 నిమిషాల నుంచి గంట వరకు ఎంతో కొంత కొనుగోలు చేసినా (పార్కింగ్ ఫీజు కంటే తక్కువ బిల్లు చూపినా) వసూలు చేయవద్దు. గంటపైన వాహనం నిలిపితే... పార్కింగ్ ఫీజు కంటే ఎక్కువ కొనుగోలు చేసిన బిల్లు/సినిమా టికెట్ చూపిస్తే పార్కింగ్ ఫ్రీ అని స్పష్టం చేశారు. అయితే పార్కింగ్ ఫీజు విధానం అవుతుంది. కానీ సింగిల్ స్క్రీన్ థియేటర్ల యజమానులు వాహనాలను కాపాడడం, క్రమపద్ధతి పార్కింగ్ చేసేలా నియమించే సిబ్బందికి వేతనాల చెల్లింపు ఆర్థికంగా భారమవుతుందని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ థియేటర్లలో పార్కింగ్ ఫీజుకు అవకాశం కల్పించింది. మాల్స్, మల్టీప్లెక్స్‌లు, ఇతర వాణిజ్య సముదాయాల్లో మాత్రం పాత విధానమే కొనసాగు తుందని పేర్కొంది. కానీ నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తూ వాహనదారులను దోచుకుంటున్నాయి.గ్రేటర్‌లో మాల్స్, మల్టిప్లెక్స్‌లో పార్కింగ్ ఫీజు వసూలు చేయడంతో నగవాసులు ఫిర్యాదులు చేశారు. ఈనేపథ్యంలో సింగిల్ స్క్రీన్ థియేటర్లలో పార్కింగ్ ఫీజుకు అవకాశం కల్పిస్తూ జారీ చేసిన పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ అధికారులు మరోసారి ఉత్తర్వుల కాపీని శనివారం బహిర్గతం చేశారు. ఎక్కడైనా మాల్స్, మల్టిఫ్లెక్స్‌లో పార్కింగ్ ఫీజు వసూలు చేస్తే జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరుతోంది.

## ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు తనిఖీ



యాదాద్రి నవంబర్ 24 వలిగొండ ప్రజాపాలన ప్రతినిది మండల కేంద్రంతోపాటు మండలంలోని వేములకొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను బుధవారం రాష్ట్ర కుష్టువ్యాది నిపుణులు డిప్యూటీ మెడికల్ అధికారి వెంకటేశ్వర చారి,అసిస్టెంట్ మెడికల్ అధికారి రాములు పాల్గొని రికార్డులు,రిపోర్టులను పరిశీలించి వైద్య బృందానికి తగు సూచనలు చేశారు.రోగులకు కుష్టు వ్యాధి నిర్దారణ అయిన వెంటనే ప్రాథమిక దశలోనే మందులు వాడితే వ్యాధి నయమవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యులు సుమన్ కళ్యాణ్,శ్రీనివాస్ రెడ్డి,నతీష్,వీణ,పవన్ తేజ,వైద్య సిబ్బంది వి కృష్ణయ్య,ఏ లక్ష్మయ్య,సువర్ణ,పద్మావతి, సుశీల,రాములమ్మ,వినోద,సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సౌకర్యార్థం జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు: జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

మంచిర్యాలబ్యూరో, నవంబర్ 24, ప్రజాపాలన :జిల్లాలో వానాకాలం (ఖరీఫ్) 2021-22 కు గాను వరిధాన్యం కొనుగోలు, కనీస మద్దతు ధర తదితర అంశాలపై రైతుల సౌకర్యార్థం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవనంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటులో భాగంగా జిల్లాలో వరిధాన్యం కొనుగోలు, కనీస మద్దతు ధర, సంబంధిత అంశాలలో సమస్యల పరిష్కారం, సందేహాల నివృత్తి కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు., పనిదినాలలో ఉదయం 8 గం?ల నుండి రాత్రి 9 గం.ఎల వరకు కంట్రోల్ రూమ్ నం. 6303928682లో సంప్రదించవచ్చని తెలిపారు., వచ్చిన ప్రతి అర్జీ, ఫిర్యాదును నమోదు చేయడంతో పాటు పరిష్కారం దిశగా ఆయా సంబంధిత అధికారులకు తెలియజేయడం జరుగుతుందని పేర్కొన్నారు., ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు..

## కారు ఢీకొని వికలాంగ యువకుడు మృతి



బోనకల్లు నవంబర్ 24 ప్రజా పాలన ప్రతినిధి: మండల కేంద్రంలో ని జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై ఇండియన్ ఆయిల్ బంకు సమీపంలో మూలమలుపు వద్ద ప్రమాద వశాత్తు జగ్గయ్య పేట నుండి బోనకల్ వైపు వస్తున్న కారు వికలాంగుడికి సంబంధించిన మూడు చక్రాల స్కూటీని ఢీ కొనడంతో వికలాంగ యువకుడు పృథ్వి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ కారు ప్రమాదంలో వికలాంగుడి స్కూటీపై కూర్చున్న వ్యక్తికి స్వల్ప గాయాలు కావడంతో ప్రమాదం నుంచి బయట పడ్డాడు. బోనకల్ ఎస్సై కవిత సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద ఘటనను పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గత మూడు నెలల క్రితం పృథ్వీ అన్నగారు ప్రమాదవశాత్తు రైలు ప్రమాదంలో చనిపోయారు. ఈ మూడు నెలల్లో ఇద్దరి అన్నదమ్ముల మరణవార్త వారి కుటుంబం జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రమాద ఘటన పరిశీలించిన స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జిటిఎస్ఎస్ఎస్ ఆర్థిక సహకారంతో గ్రామంలో బోర్లు



బోనకల్, నవంబర్ 24 ప్రజా పాలన ప్రతినిధి: బోనకల్ మండల పరిధిలో చిరునోముల గ్రామ ప్రజల అవసరాలకు కోరికమేరకు క్రైస్తవ సంస్థ జి టి ఎస్ ఎస్ ఎస్ ఖమ్మం వారి ఆర్థిక సహకారంతో చిరునోముల గ్రామంలో రెండు బోర్లు వేసారు.వీటిని మండల పశువైద్యాధికారి, గ్రామ సర్పంచ్ ములకారపు రవి ప్రారంభించారు. గ్రామంలో 25 బోర్లు మంజూరు చేసి లక్షల రూపాయలు వెచ్చించి గ్రామ ప్రధాన సమస్యలు తీరుస్తున్నారని గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల కారపు రవి, వార్డు మెంబర్లు, సంస్థ ప్రతినిధులు జాన్,అశోక్ మరియు ఎర్నెస్ట్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆళ్లపాడు లో మిర్చి తోటలు పరిశీలించిన సర్పంచ్ మరియు వ్యవసాయ శాఖ అధికారులు



బోనకల్ ,నవంబర్ 24 ప్రజాపాలన ప్రతినిధి: మండల పరిధిలోని ఆళ్ళపాడు గ్రామంలో మిర్చి తోటలో కొత్త రకం వైరస్ వలన నష్టపోయిన పంటలను సర్పంచ్ మర్రి తిరుపతిరావు ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు సందర్శించారు. ఆళ్లపాడు గ్రామంలో రైతుల బృందం పర్యటించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అధికారులు వెంటనే గ్రామానికి రావాలన్నా విజ్ఞప్తితో బోనకల్ మండల వ్యవసాయ అధికారి అబ్బూరి శరత్ బాబు, ఉద్యానవన శాఖ అధికారి ఆకుల వేణులు ఆళ్లపాడు ఏఈఓ వై సాధన గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల వలన నల్ల తామర పురుగులు ఏర్పడ్డాయని వాతావరణంలో మార్పులతో నే ఈ పురుగులు కూడా పోతాయన్న అంచనాల్ని శాస్త్రవేత్తలు అంచనా వేశారన్నారు. ఉద్యానవన శాఖ అధికారి వేణు మాట్లాడుతూ ఎక్కువ ఖరీదు గల మందులు వాడకుండా స్పైరోటెట్రా మైట్( మెమెంటో) 1.25 మీ.లి/లీటర్ నీటికి, స్పైనోసాడ్( ట్రెసర్) 04.మీ .లి/లీటర్

నీటికి,క్లోరోపేనఫైర్ (ఇంటర్ ప్రీడ్) 2 మీ. లి/లీటర్

థియాక్లోప్రీడ్(అలాంటో) 2-మీ.లి /లీటర్ నీటికి

స్పైనోటోరం (డిగిలెట్) 2 మీ లి/లీటర్ నీటికి

వేపనునే (10000పిపిఎం) 3మీ.లి / లీటర్ నీటికి మందులను పిచికారీ చేస్తే ఫలితం ఉందని శాస్త్రవేత్తలు తేల్చారన్నారు. రైతులు అనవసరంగా ఖరీదు గల మందులు ఉపయోగించకుండా సేంద్రియ పద్ధతుల్లో తక్కువ ఖరీదు ఉన్న మందుల్ని వాడాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. అధికారుల వెంట గ్రామరైతు కమిటీ అధ్యక్షుడు దొంతి బోయిన భూశయ్య, రైతు పార వేంకటేశ్వర్లు మంద సామయ్య, వేముల నరేష్, కందుల శ్రీను, మంద ఆంజనేయులు ,మంద వేంకటేశ్వర్లు, కూరకుల నాయుడు, బండి నాగేశ్వరరావు ,మరీదు తిరుపతి రావు, తదితరులు పాల్గొన్నారు.

## కరోనాతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి 15 లక్షల రూపాయల చెక్కు అందజేసిన గని మేనేజర్ భూ శంకరయ్య



మందమర్రి నవంబర్ 23 ప్రజాపాలన ప్రతినిది: కెకె 5 గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తు ఇటీవలన కరోనాతో మృతి చెందిన తోకల వెంకటేష్ కుటుంబానికి మంగళవారం పదిహేను లక్షల రూపాయల చెక్కును గని మేనేజర్ భూ శంకరయ్య వారి కుటుంబానికి అందజేసారు. మృతునికుటుంబానికి గ్రూప్ ఇన్సూరెన్స్ కింద మంజూరైన లక్షా ఇరవై అయిదు వేల రూపాయల చెక్కును ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా శంకరయ్య మాట్లాడుతూ కరోనాతో మృతిచెందిన కుటుంబాలకు యాజమాన్యం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. వెంటనే ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగాన్ని ఇస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో రక్షణ అదికారి కుష్వా అసిస్టెంట్ మేనేజర్ శ్రీకాంత్, సంక్షేమ అదికారి విశ్రాంతు టి బి జి కె ఎస్ పిటీ కార్యదర్శి జిడి బాబు గంగరాజు రామ్ చందర్, ఏఐటియుసి నాయకులు తిరుపతి, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోతే ఉద్యమం

**జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సిరబోయిన మల్లేష్ యాదవ్**



యాదాద్రి భువనగిరి జిల్లా 25 నవంబర్ ( ప్రజా పాలన ప్రతినిధి ) ప్రజా చైతన్య యాత్రలో భాగంగా కల్లాల్లోకి కాంగ్రెస్ నాయకులు కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం మోటకొండూరు మండల కేంద్రంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజా చైతన్య యాత్రలో భాగంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సిరబోయిన మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో మోటకొండురూ మండల పరిధిలో ఉన్న ఐకేపీ సెంటర్లలో ఉన్న వడ్లను పరిశీలించి, తడిసిన వడ్లను కూడా వెంటనే కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అలాగే వడ్లగొనుగొలు కేంద్రాల నుండి నిరసన ప్రదర్శనతో తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సిరాబోయిన మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ కాల్లాలా నుండి వచ్చిన ధాన్యం ను కొనుగోలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు చేయు విషయంలో కేసీఆర్ నాయకత్వంలో ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రం కొనుగోలు చేయడం లేదని మరోవైపు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసే విషయంలో ఎలాంటి షరతులు విధించలేదని దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఒకరు ఒకరి తప్పులు మరొకరు ఎత్తిచూపుతూ అన్నదాతలకు అన్యాయం చేస్తున్నారు రైతు ప్రభుత్వం అని చెప్పే కేసీఆర్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విషయంలో చేతులెత్తేయడం వారి అసమర్థతకు అద్దం పడుతుందని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయలేకపోవడం వల్ల అకాల వర్షాలకు తడిసి ముద్దయిన ఎలాంటి షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని మద్దతు ధర కల్పించాలని లేని యెడల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు శీల బాలకృష్ణ, రేగు చంద్రశేఖర్, కురుమ సంఘం అధ్యక్షుడు ఆలేటి ఉప్పలయ్య, బోనగిరి ఎల్లయ్య, బొంగు పుల్లయ్య, ఉప సర్పంచ్ చీరబోయిన వెంకట్, మల్లేష్ యాదవ్, గడ్డం వెంకటేష్ గౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పల్లె శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ నాయకులు భూమండల బంగారి, మంజూరు, బుగ్గ శ్రీకాంత్, వంగ శివ, శ్రీకాంత్, నాగరాజు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు చేయడం లో తెరాస, బిజెపి ప్రభుత్వాలు విఫలం



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 24 ప్రజాపాలన ప్రతినిధి : రైతులు పండించిన వరి ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలనీ కోరుతూ, రైతులను మోసం చేస్తున్న తెరాస, బిజెపి ప్రభుత్వాల మొండి వైఖరి నశించాలని కోరుతూ .కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు బుధవారం రోజున మాజీ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అద్వర్యంలో అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధి లోని గౌరెల్లి ,బండరావిరాల రైతుల కల్లాలను సందర్శించి అనంతరం స్థానిక తహశీల్దార్ కి వినతిపత్రం అందచేయడం జరిగింది ..రైతులను ఆదుకోకపోతే సీఎం క్యాంపు కార్యాలయం ప్రగతిభవన్ ని రైతుల ధాన్యం తో ముట్టడిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు ,సీనియర్ నాయకులు చిలుక మధుసూదన్ రెడ్డి, పాల్గొన్నారు.

## తహశీల్దార్ కు వినతి



యాదాద్రి నవంబర్ 24 వలిగొండ ప్రజాపాలన ప్రతినిది రైతులు పండించిన వరి దాన్యం కొనుగోలు కేంద్రాలలో నిల్వచేసి 45 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు కొనుగోళ్లు వేగంగా నిర్వహించడం లేదని ఏఐసీసీ,టిపిసిసి పిలుపు మేరకు డిసిసి అధ్యక్షులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహశీల్దార్ నాగలక్ష్మీ కి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి,కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బండారి నర్సింహారెడ్డి,పట్టణ అధ్యక్షుడు కంకల కిష్టయ్య,బిసి సెల్ మండల అధ్యక్షుడు బొల్ల శ్రీనివాస్ నాయకులు పల్లెర్ల రాజు,ఆవుల స్వామి,చెన్నయ్య,లింగారెడ్డి,కాసుల వెంకన్న,బర్మా జంగయ్య,కృష్ణ యాదవ్,ఎమ్మె మల్లేశం,జూకంటి నర్సింహా,రేపాక మలుగ రాములు,గుండాల సాయి తదితరులు పాల్గొన్నారు.

## బిఎస్‌పి పార్టీని మరిత పటిష్ట పరుస్తాం



ఇబ్రహీంపట్నం అక్టోబర్ తేదీ 24 ప్రజాపాలన ప్రతినిధి :బుధవరం రోజు తుర్కయాంజల్ మున్సిపాలిటీ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ అధ్యక్షులు వద్దిగళ్ల బాబు అధ్యక్షతన ముఖ్యకారకర్తల సమావేశం జరిగినది సమావేశానికి ముఖ్య అతిధి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులు గ్యార మల్లేష్ హాజరు అయ్యారు. మున్సిపాలిటీ కోశాధికారిగా పట్నం రమేష్ కురుమ ని నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాక్షులు యడవల్లి శ్యామ్ ,ప్రదాన కార్యదర్శి దోమలపల్లి రవికుమార్, కార్యవర్గ సభ్యుడు లపంగి రాజు తిప్పర్తి సైదులు, అమరవరపు రవి, సైదులు, అబ్రహం, బలరాం, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కె కె.ఆర్ఎం ట్రస్ట్ మరియు ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సృజన క్లబ్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్ పంపిణీ



హైదరాబాద్(ప్రజాపాలన ప్రతినిధి) :ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు యర్ల చంద్ర శేఖర్ జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక హబ్సిగూడ గౌట్ స్కూల్ లోని 10 క్లాస్ విద్యార్థులకు కుసుమ కమల రత్నం మెమోరియల్ ట్రస్ట్ మరియుఇన్నర్ వీల్ క్లబ్ అఫ్ హైదరాబాద్ సృజన క్లబ్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్ మరియు కంపాస్ బాక్సులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఇద్దరు విద్యార్థులకు కాలేజీ లో జాయిన్ అవ్వటానికి ఆర్థిక సహాయం అందించారు. పాఠశాల విద్యార్థులు మరియుఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు యర్ల చంద్ర శేఖర్ కి జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియ చేశారు. ఇంత చక్కటి కార్యక్రమానికి సహకరించినందుకు ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సృజన క్లబ్ సభ్యులు యర్ల చంద్ర శేఖర్ కు ధన్యవాదాలు తెలియచేశారు.


మాస్టర్ కీ TV
(అంబేడ్కర్ TV)

MASTER KEY TV
NEWS FOR EQUALITY

జై భీం,

మీరు నాయకుడిగా ఎదగాలని అనుకుంటున్నారా...?
మీరనుకున్న వార్తలు రావాలని కోరుకుంటున్నారా...?
పెట్టుబడి లేకుండా ఆదాయం పొందాలని అనుకుంటున్నారా...?
మీరూ మీ అసెంబ్లీ నియోజకవర్గం లో
టీవీ ఛానల్ ఓనర్ గా కావాలని అనుకుంటున్నారా...?

అయితే రండి, కదలి రండీ

బహుజనాభివృద్దే.. దేశాభివృద్ధి అని నిరూపిద్దాం

1. ఈ దేశంలో ఉన్న ఫోర్త్ ఎస్టేట్ (మీడియా రంగం) బహుజనుల సమస్యల మీద ప్రచారం చేయడం లేదని మీ అందరికీ తెలుసు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా విలేఖరులకు సామాజిక కార్యకర్తలకు, అంబేడ్కర్, పూలే సంఘం నాయకులకు, కనీసం 100 మంది తెలిసిన గ్రూపునాయకులకు టీవీ ఛానల్ ప్రతినిధిగా / యజమానిగా అవకాశం ఇవ్వబడును.
2. జీవిత కాలంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతినిధిగా / యజమానిగా నియమించబడును.
3. ఆయా ప్రతినిధికి ప్రకటనల ఆదాయం (Advertising Revenue)లో ప్రకటనలపై 40% ఆదాయం ఇవ్వబడును.
4. వార్తలను స్వేచ్ఛాయతంగా ప్రసారం (Telecast) చేసే వీలు కల్పించబడును.

సంప్రదించండి

Tel No: 9849031420 ,9440918143, 94409 18371, 94400 53858, 93473 50692,8008840506, 9440077239, 7798832998, 76600 27678,

Office: Ambedkar TV Channel, 3rd Floor, Dault Plaza, Main Road, Besides Bata Showroom, Lakdi ka pool, Hyderabad - 500004

E- mail : ambedkartvchannel2018@gmail.com www.ambedkartv.org

ప్రజాపాలన
సంపాదకీయం
గురువారం 25, నవంబరు 2021

## మోదీలో ప్రజాస్వామ్యవాది మేల్కొన్నాడా?

ఎన్నికలు సమీపిస్తుంటే తమ కాళ్ల కింద నేల కరిగిపోతున్నట్లు, ఎవరో తమ సర్వస్వం దోచుకుపోతున్నట్లు రాజకీయ నాయకులకు దుస్వప్నాలు వస్తుంటాయి. ఎప్పుడూ ఎవరికీ లొంగరని, ఎవర్నీ కలుసుకోరని, తమ రాతి మేడల్లో తాము నిరంకుశుల్లా జీవిస్తుంటారని పేరు తెచ్చుకున్న నేతలు సైతం ఎన్నికలు సమీపిస్తుంటే కిందకు దిగివచ్చి ప్రజలను మచ్చిక చేసుకునేందుకు పలు రకాల వ్యూహాలు అల్లుతుంటారు. ఉత్తరప్రదేశ్, పంజాబ్ ఎన్నికలు సమీపిస్తుంటే ప్రధానమంత్రి నరేంద్రమోదీకి కూడా వ్యూహాలు అల్లక తప్పని పరిస్థితి ఏర్పడినట్లు కనిపిస్తోంది. లేకపోతే ఉక్కుమనిషిలా గుర్తింపు పొంది, ఎవరికీ ఒక పట్టాన లొంగే మనస్తత్వం లేదనిపించుకున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా ఎందుకు ఉన్నట్లుండి సాగు చట్టాలను వెనక్కు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు? ఆయన ప్రజాస్వామ్యవాదిగా మారారని అనుకోవడం కూడా అర్థరహితం. ఎందుకంటే సాగుచట్టాలను ప్రవేశపెట్టినప్పుడు ఎంత ఏకపక్షంగా వ్యవహరించారో, వాటిని ఉపసంహరించుకున్నప్పుడు కూడా మోదీ అంతే ఏకపక్షంగా వ్యవహరించారు. ఇదే మరో నేత అయి ఉంటే పెద్దఎత్తున రైతులను, సిక్కులను ఇంటికి పిలిపించుకుని వారితో చర్చలు జరిపిన తర్వాత తన నిర్ణయాన్ని ప్రకటించి ఉండేవారు. మరి మోదీ కనీసం పార్టీలో కీలకనేతలతో కూడా చర్చించలేదు. పెద్దనోట్ల రద్దును ప్రకటించిన మాదిరే సాగుచట్టాల ఉపసంహరణను కూడా ఎవరితో చర్చించకుండా ప్రకటించారు. దీన్ని బట్టి ఆయన మనస్తత్వం ఏమీ మారలేదన్న విషయం స్పష్టమవుతోంది. తాను తీసుకునే నిర్ణయం ఘనత మరెవరికీ దక్కకూడదని, అన్ని నిర్ణయాలు తానే తీసుకుని ప్రకటించాలనే మోదీ వైఖరి ఈ వెనుకడుగులోనూ తెలుస్తోంది. బహుశా అందుకే మోదీ నిర్ణయం ప్రకటించిన తర్వాత దాని వెనుక ఉన్న తర్కాన్ని వివరించేందుకు ఏ పార్టీ నేతా ముందుకు రావడం లేదు. అంతా హతాశులైనట్లు, తమ అగ్రనాయకుడు నిర్ణయం ప్రకటించిన తర్వాత తాము మాట్లాడితే ఏ కొంప మునుగుతుందో అని భయపడుతున్నట్లు అధికార పార్టీ నేతలను కదిపితే అర్థమవుతోంది. 'మాకు కారణాలు తెలుసు, కానీ చెప్పలేము..' అని ఒక సీనియర్ పార్టీ నేత అన్నారు. ఒక ప్రజాస్వామిక దేశంలో ప్రజాస్వామికంగా ఎన్నికైన నేత తన నిర్ణయాన్ని ప్రకటించే ముందు, తర్వాత కనీసం తన పార్టీలోనైనా ప్రజాస్వామిక చర్చ జరిపించాలనే ఉద్దేశం లేకపోతే ఆ నాయకుని మనస్తత్వాన్ని ఏమని అభివర్ణించాలి? ఏకపక్షంగా ప్రకటించినప్పటికీ, మోదీ దాదాపు ఏడాది తర్వాత తన నిర్ణయం మూలంగా తన పార్టీకే ఎక్కువ నష్టమని గ్రహించినందువల్లే అయిష్టంగానైనా దిగి వచ్చారన్న విషయం అర్థమవుతోంది. ప్రధానమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తికి ఎప్పటికప్పుడు రాజకీయ పరిస్థితి గురించి తాజా నివేదికలు అందుతూనే ఉంటాయి. ఉత్తరప్రదేశ్‌లో పరిస్థితులు పైకి అనుకున్నంత సాఫీగా లేవని, ముఖ్యంగా పశ్చిమ యూపీలో రైతులు, ముఖ్యంగా జాట్‌రైతుల ఆగ్రహం మూలంగా బిజెపి వ్యతిరేక ప్రభంజనం వీస్తుందని ఇప్పటికి మూడు సర్వేల్లో తేలినట్లు తెలుస్తోంది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జరిపించిన అంతర్గత సర్వేలో కూడా పశ్చిమ యుపిలో బిజెపి వ్యతిరేక గాలులు తీవ్రంగా వీస్తున్నాయని తేలినట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ, 2017 అసెంబ్లీ ఎన్నికల్లోనూ బిజెపి ఈ ప్రాంతంలో అత్యధిక సీట్లను గెలుచుకుంది. పశ్చిమ యూపీలోని 14 జిల్లాల్లో 2017లో బిజెపి మొత్తం 71 సీట్లలో 52 సీట్లు గెలుచుకుంది. తూర్పు యూపీగా పేరు పొందిన పూర్వాంచల్‌లో గత ఎన్నికల్లో బిజెపి 164 సీట్లలో 115 సీట్లను గెలుచుకుంది. ఈసారి ఈ ప్రాంతంలో పట్టు నిలబెట్టుకునేందుకు మోదీ తీవ్రయత్నాలు చేస్తున్నారు. గత జూలై నుంచి మూడుసార్లు పర్యటించి అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవంతో పాటు అనేక ప్రాజెక్టులకు ప్రారంభ కార్యక్రమాలు నిర్వహించారు. అమిత్ షా కూడా వారణాసి కేంద్రంగా తన ప్రచారవ్యూహాన్ని రూపొందించారు. 2017 ఎన్నికల్లో బిఎస్‌పి, ఎస్‌పి మధ్య ముస్లిం ఓట్లు చీలిపోవడంతో బిజెపి, మిత్రపక్షాలు దాదాపు 111 నియోజకవర్గాల్లో విజయం సాధించగలిగాయి. ఈసారి ముస్లిం ఓట్లు చీలిపోయే అవకాశాలు లేవని, వారు సమాజ్‌వాది పార్టీ వెనుక బలంగా సంఘటితమయ్యారని అంతర్గత సర్వేల్లో తేలింది. బహుజన సమాజ్ పార్టీ బలం క్షీణించడం, అనేక చిన్న పార్టీలు సమాజ్‌వాది పార్టీతో కూడా పొత్తు పెట్టుకోవడంతో ఆ పార్టీ బిజెపికి ప్రధాన ప్రత్యర్థిగా మారిందని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకే మోదీ, అమిత్ షా స్వయంగా రంగంలోకి దిగడంతో పాటు సాగు చట్టాలను ఉపసంహరించుకోవడానికైనా సిద్ధపడక తప్పలేదు. ఇక పంజాబ్‌లో బిజెపికి తన విజయం కన్నా పూర్తిగా సిక్కులు వ్యతిరేకం కావడం తీవ్ర ఆందోళన కలిగించినట్లు తెలుస్తోంది. బిజెపి నేతలు ఎక్కడకు వెళ్లినా సిక్కులు దాడులు చేయడం ఆ పార్టీ ఊహించలేదు. నిజానికి రైతాంగం వెనుక సిక్కులు బలంగా నిలబడడం వల్లే దాదాపు ఏడాదికి పైగా పోరాటం చెక్కుచెదరకుండా కొనసాగింది. రిపబ్లిక్ డే రోజు సృష్టించిన ఘటనలతో సిక్కులను దేశద్రోహులుగా, ఉగ్రవాదులుగా, ఖలిస్తానీలుగా చిత్రించేందుకు తద్వారా హిందూ ఓట్లను సంఘటితం చేసుకునేందుకు జరిగిన ప్రయత్నాలు బిజెపి సైద్ధాంతిక భ్రష్టతను వెల్లడించాయి. నిజానికి ఆపరేషన్ బ్లూస్టార్ తర్వాత పంజాబ్‌లో పరిస్థితులు సద్దుమణిగేందుకు చాలా కాలం పట్టింది. ఆ సమయంలో హిందువులు, సిక్కుల మధ్య ఐక్యతకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నిర్వహించిన పాత్రను విస్మరించలేం. అటల్ బిహారీ వాజపేయి, లాల్ కృష్ణ ఆడ్వాణీల మూలంగా నాలుగు దశాబ్దాలకు పైగా బిజెపి%--%అకాలీదళ్‌ల మధ్య సంబంధాలు వర్ధిల్లడమే కాదు, ఎన్నికల పొత్తులు కుదుర్చుకోవడం హిందూ%--%సిక్కు రాజకీయ సయోధ్యకు గుణాత్మకమైన రీతిలో తోడ్పడింది. 'పంజాబ్‌లో పట్టు కోసం సిక్కులపై హిందువులను రెచ్చగొట్టేందుకు మీరు సిద్ధపడుతున్నారు. కార్పొరేట్‌ల కోసం రైతు వ్యతిరేక నిర్ణయాలు తీసుకోవడమే కాక విద్వేషాలు సృష్టిస్తున్నారు. వాజపేయి హయాంలో అందర్నీ కలుపుకుపోయేందుకు అవలంబించిన ఉదార వాద విధానాలను ఎందుకు మరిచిపోయారు' అని కొద్దిరోజుల క్రితం అకాలీదళ్ నేత చందూ మజ్రా ప్రశ్నించారు. నిజానికి సిక్కులను కూడా హిందూజాతిలో భాగంగా భావించే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌కు కూడా పంజాబ్‌లో బిజెపి శత్రు పార్టీగా మారడం ఇష్టం లేదనే తెలుస్తోంది. దేశ విభజన కాలం నాటి నుంచీ సంఘ్‌కూ సిక్కులకూ అవినాభావ సంబంధాలున్నాయి. మతకల్లోలాల్లో సిక్కులను కాపాడిన చరిత్ర ఆర్‌ఎస్‌ఎస్‌కు ఉన్నది. వాజపేయి, ఆడ్వాణీలకు ఈ చరిత్ర తెలుసు కనుకే అకాలీదళ్‌తో స్నేహ సంబంధాలను కొనసాగించారు. అయితే మోదీ ఆ చరిత్రను విస్మరించడమే కాక సిక్కుల పాత గాయాల్ని రేపే ప్రయత్నం చేశారు. ఇది ప్రమాదకర పరిణామాలకు దారి తీయవచ్చని కూడా ఇంటెలిజెన్స్ వర్గాలు చెప్పాయని ప్రచారం జరుగుతోంది. ఇన్నాళ్లకు ఏ ఆత్మజ్ఞాన ప్రబోధం జరిగిందో కాని గురునానక్ జయంతి సందర్భంగా ఆయన మళ్లీ సిక్కులకు స్నేహహస్తం చాచారు. వారిని క్షమాపణ కోరారు. అకాలీదళ్‌ను అంత త్వరగా తమ వైపుకు తిప్పుకోవడం సాధ్యం కాదని తెలిసిన మోదీ కాంగ్రెస్ నుంచి వేరు పడిన మాజీ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్‌తో బేరసారాలు ప్రారంభించారు. ఇది చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం లాంటిది. తమ ప్రయోజనాలను దెబ్బతీసిన రాజకీయ పార్టీని పంజాబ్ రైతాంగం, ప్రజలు అంత త్వరగా క్షమించే అవకాశం లేదు. విచిత్రమేమంటే తన అనాలోచిత నిర్ణయాల ద్వారా సామాజిక అశాంతికి కారణమైంది ప్రభుత్వమైతే అందుకు పౌరసమాజాన్ని విమర్శించడం మోదీ నేతృత్వంలోని బిజెపిలో నెలకొన్న మరో సైద్ధాంతిక వైపరీత్యం. దేశంలో ప్రభుత్వాలు తప్పుడు విధానాలు అవలంబించినప్పుడు ముందుగా పౌరసమాజం మేల్కొంటుంది. ఎన్నికల్లో జయాపజయాలతో ప్రమేయం లేకుండా ఉద్యమాల్ని నిర్వహించడం, ప్రభుత్వాలకు వాస్తవాలను చెప్పే ప్రయత్నం చేయడం చేస్తుంది. గతంలో యుపిఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్నా హజారే, కేజ్రీవాల్, రాందేవ్, యోగేంద్రయాదవ్ లాంటి అనేకమంది నిర్వహించిన ఉద్యమాల వల్లే దేశంలో కాంగ్రెస్ వ్యతిరేక వాతావరణం ఏర్పడి భారతీయ జనతా పార్టీ ప్రయోజనం పొందింది. కాని ఇవాళ ప్రభుత్వాన్ని తప్పు పట్టే పౌరసమాజాన్ని ప్రమాదకరంగా చిత్రించడం బిజెపి సిద్ధాంతంగా మారిపోయింది. అదే ఆలోచనా విధానాన్ని ఇటీవల జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ప్రకటిస్తూ పౌరసమాజం కొత్త యుద్ధానికి తెరలేపుతోందని, దేశ ప్రయోజనాలను దెబ్బతీస్తోందని దుయ్యబట్టారు. ఇలాంటి వారి సలహాల వల్లే ప్రజల సమస్యల గురించి ప్రశ్నించినందుకు, రైతులకు సంఘీభావం తెలిపినందుకు చిన్న పిల్లలను సైతం జైలుకు పంపేందుకు మోదీ ప్రభుత్వం వెనుకాడలేదు. భారతదేశంలో ప్రజాస్వామ్యం ఉన్నదని, అది ఇంకా పోలీసు రాజ్యం కాదని అనేకమంది మాజీ ఐపీఎస్ అధికారులు దోవల్ ప్రకటనను విమర్శిస్తూ వ్యాఖ్యలు చేశారు. సాగుచట్టాలను ఉపసంహరించుకోవడం ప్రధానంగా రాజకీయ ప్రయోజనాలు, ఎన్నికల కోసమే అని మెజారిటీ విశ్లేషకులు భావిస్తున్నందువల్ల మోదీ ఆలోచనా విధానంలో పరివర్తన వచ్చిందని అనుకోవడానికి వీల్లేదు. 2014లో మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు ఆయనకు మద్దతు నిచ్చిన మెజారిటీ హిందువుల్లో అనేకమంది ఉదారవాదులు, తటస్థులు కూడా లేకపోలేదు. గుజరాత్ అల్లర్లను మరిచి మరీ మోదీని వారు నెత్తికెత్తుకున్నారు. అనేక రాజకీయపార్టీలు కూడా బిజెపితో స్నేహహస్తం చాచేందుకు ముందుకువచ్చాయి.

## బిసి రిజర్వేషన్ల రగడ ఈనాటిది కాదు... పుంజాల శివశంకర్

1952 లో నేను ఇంకో ఇద్దరినీ తీసుకుని అప్పటి ముఖ్య మంత్రి బూరుగుల రామకృష్ణయ్య గారి దగ్గరికి పోయి, బాక్వార్డ్ క్లాస్(బీసీ) లిస్ట్ తయారు చేపించమని రిక్వెస్ట్ చేసినాము. కానీ ఆయన దానిని పట్టించుకోలేదు. 1955 కాకా కళేల్కర్ కమిషన్ వచ్చిన తరువాత దాని అంశములతో లిస్ట్ ప్రిపేర్ చెయ్యడానికి మమ్ముల్ని పిలిచి మమ్ములని అధికారులతో కూర్చొని లిస్ట్ తయారు చెయ్యమన్నడు. దాని ప్రకారము బాక్వర్డ్ క్లాస్ లిస్ట్ చెయ్యడము జరిగింది. కానీ ఆ లిస్ట్ ని 1956 లో హై కోర్ట్ కొట్టేసింది. దీనికి కారణమూ అప్పటి ముఖ్య మంత్రి నీలం సంజీవ్ రెడ్డి రిజర్వేషన్స్ కి కిలాఫ్(వ్యతిరేకి) కాబట్టి, కోర్ట్ లో అప్పీల్ సక్కగ చెయ్యక పోవడము. మేము మల్ల 1960 లో దామోదరం సంజీవయ్య గారు ముఖ్య మంత్రి అయినప్పుడు ఆయనను కలిసి తిరిగి బీసీ లిస్ట్ ఆర్డర్స్ ఇష్యూ చేపించుకున్నాము. 1962 లో నీలం సంజీవ్ రెడ్డి ముఖ్య మంత్రి అయ్యి 20 ఫిబ్రవరి 1964 లో పదవి వదిలే ముందు మొత్తము బీసీ లిస్ట్ ని G.O. MS.No.301, Education, dated 3rd February 1964 ద్వారా మరల తీసేశారు ఈ మధ్యలో హై కోర్ట్ బీసీ లకి మెడికల్ కాలెజిలల్లో రేజర్వేషన్ ఇవ్వరాదు అని దాని సంబంధిత G.O.Ms.No.1886, Health dated 21st June 1963 ని కొట్టేసింది. అతని ప్లేస్ లో 1964 లో బ్రహ్మానంద రెడ్డి ముఖ్య మంత్రి అయ్యినప్పుడు మేము ఆయనను కలిసినము. ఆయన కాబినెట్ లో మంత్రి గ ఉన్న జేవీ నర్సింగ్ రావు మాకు సహాయము చెయ్యడముతో మరల బీసీ లిస్ట్ కొత్త ఆర్డర్స్ రిలీజ్ అయ్యింది. ఈ ఆర్డర్స్ ని మళ్లీ 1966లో హైకోర్టు కొట్టివేసింది. నేను చాలా సార్లు ఇండివిడ్యువల్ గా మరియు జేవీ నర్సింగ్ రావు తో బ్రహ్మానంద రెడ్డి ని కలిసి రిక్వెస్ట్ చెయ్యగా ఆయన బీసీ లిస్ట్ తయారు చెయ్యమని కొన్ని నియమావళులు ఇస్తూ ఒక కాబినెట్ సబ్ కమిటీ ని వేశారు. దానికి నన్ను లీగల్ ఇంకా టెక్నికల్ అడ్వైజర్గా స్పెషల్ ఇన్వైటి గా పేర్కొన్నారు. తర్జన భర్జన తరువాత ఆంధ్ర బీసీ లిస్ట్ లో ఉన్న 86, తెలంగాణ లో ఉన్న 60, మొత్తము 146, లిస్ట్ ని 112, కి కుదించి 4, జులై 1966, న గవర్నమెంట్ కి అందిస్తే G.O.Ms.No.1880, Education, dated 29th July 1966, ద్వారా గవర్నమెంట్ మేము తయారు చేసిన లిస్ట్ ని రిలీజ్ చేసింది. ఈ లిస్ట్ కి విరుద్ధముగా హై కోర్ట్ లో రిట్ పెటిషన్స్ వెయ్యడముతో కోర్ట్ ఈ G.O. ని కొట్టివేస్తూ ప్రొఫెషనల్ కాలేజీలల్లో రిజర్వేషన్స్ ఇవ్వడానికి వీలు లేదు అని హై కోర్ట్ ఆర్డర్ పాస్ చేయగా సుప్రీమ్ కోర్ట్ ఆ ఆర్డర్ ని అప్హెల్డ్ చేసింది(సమర్థించింది). (judgement dated 27th March, 1968 in the State of Andhra Pradesh and another vs P. Sagar in C.A.No. 1336 of 1967) మల్లా కథ మొదటికి వచ్చింది. మల్ల బ్రహ్మానంద రెడ్డి చుట్టూ తిరగడము తో ఆయన G.O.Ms.No.870. Education. Dated 12th April1968 ద్వారా అనంత రామన్ కమిషన్ వేస్తూ ఇంకా ఇది ఆఖరి సారిగా నీ రిక్వెస్ట్ వింటున్నాము అని నీ బీసీ ల కోసము రిజర్వేషన్స్ పట్టుదలను నువ్వే కోర్టులో సాదించుకో, కోర్టులో జడ్జీలని నువ్వు కన్విన్స్ చెయ్యలేకపోతే ఇంకా మేము ఏమీ చేయలేమని నన్ను గవర్నమెంట్ ప్లీడర్ ని చేసి అట్లనే నన్ను అనంత్ రామన్ కమిషన్ కి లీగల్ గా ఇతరత్రా అసిస్ట్ చెయ్యమని ఇంస్ట్రక్షన్స్ ఇచ్చారు. ఫైనల్లీ, 20 జూన్, 1970 న 92 కులాలతో అనంత్ రామన్ కమిషన్ గవర్నమెంట్ కి రిపోర్ట్ సబ్మిట్ చేసింది. దీనికి విరుద్ధంగా కూడా హైకోర్టులో కేసులు వేశారు. నేను ఎంత వాదించినా, బలరాం వర్సెస్ స్టేట్ అఫ్ ఆంధ్ర ప్రదేశ్ కేసులో మెడికల్ మరియు ఇతర ప్రొఫెషనల్ ఇంజనీరింగ్ లాంటి కోర్సెస్ లో ఈ లిస్ట్ చెల్లదు అని అనంత్ రామన్ కమిషన్ రికమెండేషన్స్ ని హై కోర్ట్ కొట్టివేసింది. నేను స్టేట్ గవర్నమెంట్ ని రిక్వెస్ట్ చేసుకొని కన్విన్స్ చేసి సుప్రీమ్ కోర్ట్ లో అప్పీలు వేసి 1972(1) SCC 660, (State, of, Andhra, Pradesh, and, others, vs. USV. Balram.), సుప్రీమ్ కోర్ట్ నుంచి 28 January, 1972, లో కేసు గెలిచి పాజిటివ్ జడ్జిమెంట్ తో బ్యాక్ వార్డ్ క్లాసెస్ కి రిజర్వేషన్స్ కన్ఫర్మ్ చేయించ గలగడమే కాకుండా వీరికి మెడికల్ ఇంకా అన్ని ప్రొఫెషనల్ కాలేజీ లలో కూడా ఈ రిజర్వేషన్స్ వర్తిస్తాయి అని ఆర్డర్ తీసుకురాగలిగాను.

# నిర్బంధ రాజ్య వ్యవస్థ వైపుగా ...

సి.బి.ఐ, ఇ.డి – ఈ రెండు కేంద్ర సంస్థల డైరెక్టర్ల పదవీ కాలాన్ని ప్రస్తుతం ఉన్న రెండేళ్ళ నుంచి ఐదేళ్ళకు పొడిగిస్తూ మోడీ ప్రభుత్వం రెండు ఆర్డినెన్సులను జారీ చేసింది. ఈ రెండు కేంద్ర సంస్థలూ పాలక పార్టీ చేతుల్లో పనిముట్లుగా, ఆ పార్టీ ఎజెండాను ముందుకు తీసుకుపోడానికే పని చేస్తున్నాయన్నది అందరికీ తెలిసిన విషయమే. ప్రతిపక్ష పార్టీల నేతలను, ప్రభుత్వ చర్యలను విమర్శించే మేధావులను, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించి నిలదీసే వారిని ఈ సంస్థలు తమ లక్ష్యంగా చేసుకుంటున్నాయి. అందుచేత వాటి డైరెక్టర్ల పదవీకాల పరిమితిని పెంచడం ఆ సంస్థల స్వయంప్రతిపత్తిని మరింతగా దెబ్బ తీసి, వాటి అధికారులను తమకు మరింత లొంగివుండేలా చేయడం కోసమేనని గ్రహించడానికి పెద్ద పరిజ్ఞానమేమీ అవసరం లేదు. ఒకప్పుడు సుప్రీం కోర్టు సిబిఐ ని 'పంజరంలో చిలక' అని అభివర్ణించింది. కాని మోడీ అధికారానికి రెండోసారి వచ్చిన తర్వాత ఈ సంస్థలు రాజ్యాంగం ప్రకారం మనకు సంక్రమించిన వ్యక్తిగత స్వేచ్ఛను, ప్రజాస్వామ్య హక్కులను స్వాహా చేసే రాబందుల్లాగా తయారయ్యాయి. ఈ కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేయకుండా గతంలోనే సుప్రీం కోర్టు స్పష్టమైన మార్గదర్శకాలను రూపొందించింది. ఆ సంస్థల ఉన్నతాధికారుల పదవీకాల పరిమితిని ఒకవేళ పెంచవలసివస్తే అది చాలా తక్కువ కాలానికే పెంచాలని, పెండింగులో ఉన్న విచారణను పూర్తి చేయడానికి మాత్రమే ఆ విధంగా చేయాలని స్పష్టంగా చెప్పింది. అటువంటి చర్య అత్యంత అరుదైన సందర్భాల్లో మాత్రమే తీసుకోవాలని కూడా చెప్పింది. అందుకే ప్రతిపక్షాలు, వాటితోబాటు సవ్యంగా ఆలోచించే వారందరూ నేడు ప్రజాస్వామ్య హక్కులకు, వ్యక్తిగత స్వేచ్ఛకు వాటిల్లుతున్న ముప్పు గురించి ఆందోళన పడుతూ హానికరమైన ఈ ఆర్డినెన్సుల జారీని వ్యతిరేకిస్తున్నారు.

పథకం ప్రకారం సాగుతున్న కుట్ర

ఒక్కొక్కటిగా జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే మొత్తంగానే పాలనా వ్యవస్థను మార్చివేయడానికి కుట్ర జరుగుతోందని భావించాల్సి వస్తోంది. దానివెనుక ఉన్న సైద్ధాంతిక పునాదిని మనం పూర్తిగా అవగతం చేసుకోవాలి.

జమ్ము, కాశ్మీర్ లో సిఆర్‌పిఎఫ్ జవాన్లు ఒక యువకుడిని కాల్చి చంపడాన్ని ప్రశ్నించిన ఒక మానవ హక్కుల కార్యకర్తను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ సందర్భంగా జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ట్రెయినీ పోలీసు ఆఫీసర్లను ఉద్దేశించి మాట్లాడుతూ, ఈ పౌర సమాజం "యుద్ధ రంగపు నాలుగో పార్శ్వం" అని




పేర్కొన్నారు. సాంప్రదాయ పద్ధతుల్లో యుద్ధం చేయడం ఖరీదైన వ్యవహారం అని, పౌర సమాజాన్ని లోబరుచుకుని, కుట్రలతో, ఎత్తుగడలతో ఆ సమాజం ద్వారానే దేశ ప్రయోజనాలను దెబ్బ తీయడం శత్రువు వ్యూహంగా ఉందని దోవల్ అంటున్నారు. పౌర సమాజం పట్ల తన ద్వేషాన్ని వ్యక్తం చేస్తూ పోలీసు అధికారులంతా దేశాన్ని ఆ పౌర సమాజం బారినుండి రక్షించుకోడానికి సిద్ధం కావాలని ఆయన తెలిపారు. అంతర్లీనంగా చట్టానికి కట్టుబడి వ్యవహరించాలన్న సూత్రాన్ని ఆయన దెబ్బ తీస్తున్నారు.

నేడు పోలీసులు ఏ చట్టాలనైతే గౌరవించి నడుచుకోవాలో, ఆ చట్టాలన్నీ బ్రిటిష్ వలస పాలకుల కాలంలో రూపొందినవే. వాటిని జారీ చేసినప్పుడు ఏ విధమైన ప్రజాస్వామ్యయుత చర్చా జరపలేదు. దేశద్రోహ చట్టం ఒక ముఖ్యమైన ఉదాహరణ. ఈ చట్టాలను అస్పష్టమైన పరిభాషలో, ఏ విధంగానైనా దుర్వినియోగపరచడానికి వీలు ఉండేలా రూపొందించారు. ఏ విధమైన దుర్వినియోగాన్నైనా పరిశీలించి, సరిదిద్దే అవకాశం న్యాయ వ్యవస్థ పరిధి లోకి వస్తుంది. అలా సరిదిద్దడం ఎన్నికైన ప్రజా ప్రతినిధుల పరిధిలో లేదు. దోవల్ చెప్పిన సిద్ధాంతం ఒక పోలీసు రాజ్యం కోసం ఒక పోలీసువాడు ప్రతిపాదించిన సిద్ధాంతం. ప్రభుత్వాన్ని సవాలు చేసే ప్రతీ వాడినీ దేశానికి శత్రువుగా పరిగణించాలని ఆ సిద్ధాంతం చెప్తోంది. పౌర సమాజం యుద్ధరంగపు నాలుగో పార్శ్వం అనడం వెనుక అర్థం ఇదే. జనరల్ బిపిన్ రావత్ మరో ముందుడుగు వేసి జమ్ము కాశ్మీర్ ప్రజానీకం ఉగ్రవాదుల్ని చితక్కొట్టి చంపెయ్యడానికి సిద్ధంగా ఉండడం చాలా మంచి విషయం అని బహిరంగం గానే ప్రకటించారు. ఈ విధమైన నిర్ధారణకు ఆయన రావడానికి వెనక కొన్ని గుర్తు పట్టడానికి వీలు లేని సోషల్ మీడియా పోస్టులు మాత్రమే ఆధారాలుగా ఉన్నాయి. కాని ఇంకో పక్క దేశంలో చాలా చోట్ల జరిగిన ఎన్‌కౌంటర్ హత్యలకు సంబంధించి ఆధారాలు గుట్టలు గుట్టలుగా ఉన్నా, మన మిలిటరీ జనరల్ వాటిని చూడలేకపోతున్నారు. అవన్నీ పోలీసులు ఆత్మరక్షణ కోసం చేసినవేనన్న వాదనను సమర్ధిస్తున్నారు. కొంతమంది మూకలు చట్టంతో నిమిత్తం లేకుండా, విచారణ అవసరం లేకుండా, తమ ఇష్టం వచ్చిన రీతిలో వ్యవహరించడాన్ని ప్రోత్సహించడం తప్ప ఇది వేరొకటి కాదు.

ఇటీవల జాతీయ మానవ హక్కుల కమిషన్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలు దోవల్, రావత్ వంటి వారికి వత్తాసునిచ్చేలా ఉన్నాయి. "కొందరు కొన్ని సందర్భాలలో మాత్రమే మానవ హక్కుల ఉల్లంఘన జరిగినట్టు, మరికొన్ని సందర్భాలలో జరగనట్టు పరిగణిస్తున్నారు. రాజకీయపు కళ్ళద్దాల్లోంచి చూసినప్పుడు మాత్రమే మానవ హక్కుల ఉల్లంఘన జరిగినట్టు అనిపిస్తుంది. ఈ విధంగా చూడడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. మానవ హక్కుల ఉల్లంఘన పేరుతో కొందరు దేశ ప్రతిష్టనే మసకబారుస్తున్నారు. ఆ విధంగా రాజకీయ కోణం నుంచి మానవ హక్కులను చూడడం అటు మానవ హక్కులకు, ఇటు ప్రజాస్వామ్యానికి కూడ హానికరం" అని మోడీ అన్నారు. నిరాధారంగా మానవ హక్కులను, రాజ్యాంగపరమైన హక్కులను కించపరచడం చూస్తే ఈ దేశం ఒక నిర్బంధ రాజ్యం దిశగా అడుగులు వేస్తోందని అనిపిస్తున్నది.

క్రూర చట్టాల ప్రయోగం, దుర్వినియోగం దేశద్రోహ చట్టం, ఉపా (సవరణ) చట్టం, జాతీయ భద్రతా చట్టం వంటి క్రూరమైన చట్టాలను విచ్చలవిడిగా ఉపయోగిస్తున్నారు. ఇటీవల త్రిపుర లో మైనారిటీలపై జరిగిన హింసాకాండ అనంతరం వాస్తవాలను తెలుసుకోడానికి అక్కడికి వెళ్ళిన సుప్రీం కోర్టు న్యాయవాదులను, పాత్రికేయులను ఉపా చట్టం కింద బుక్ చేయడం చూస్తే ఈ చట్టాల ప్రయోగం ఏ వికృత స్థాయికి చేరిందో బోధ పడుతుంది. దేశద్రోహ నేరం కింద కేసులను ఎదుర్కొన్న వారిలో 9 శాతం, ఉపా చట్టం కింద కేసులు ఎదుర్కొన్న వారిలో 11 శాతం కొన్ని సంవత్సరాలపాటు నిర్బంధంలో ఉన్న తర్వాత ఎటువంటి ఆధారాలూ లేవని పోలీసులే ఆ కేసులు మూసేశారు. దేశద్రోహ నేరం కింద అరెస్టయిన వారిలో కేవలం 17 శాతం మంది మీద మాత్రమే చార్జిషీట్లు దాఖలు చేశారు. అదే ఉపా చట్టం కింద అరెస్టయిన వారిలో 9 శాతం మంది మీద మాత్రమే చార్జిషీట్లు దాఖలయ్యాయి. దేశద్రోహ నేరం రుజువై శిక్షలు పడినవారు కేవలం 3.3 శాతం మాత్రమే. ఇతర నేరాలతో పోల్చితే దేశద్రోహ నేరం కింద, ఉపా కింద శిక్షలు పడినవారి సంఖ్య చాలా స్వల్పం.

జాతీయ నేరాల రికార్డు ప్రకారం 2016తో పోల్చితే 2019లో దేశద్రోహ నేరం కింద కేసులు బుక్ అయినవి ఏకంగా 165 శాతం పెరిగాయి. ఉపా చట్టం కింద 33 శాతం పెరిగాయి.

ఈ క్రూర చట్టాలను ఏమాత్రమూ విచక్షణ చూపకుండా విచ్చలవిడిగా ఏవిధంగా ప్రయోగిస్తున్నారో, ఆ చట్టాలలో పేర్కొన్న లక్ష్యాలకు ఉద్దేశాలకు సంబంధం లేకుండా ఎలా వ్యవహరిస్తున్నారో పై వివరాలే తెలియజేస్తున్నాయి. పైగా ఆ చట్టాలలో వాడిన భాష,పదాలు వాటిని దుర్వినియోగపరచడానికే అన్నట్టుగా ఉన్నాయి. ఈ చట్టాలకింద కేసులు ఎదుర్కునేవారిలో అత్యధిక శాతంపై నేరం రుజువు కాకపోయినా, వారిని అతి దారుణంగా వేధించడానికి, బెయిల్ ఇవ్వకుండా నిర్బంధించడానికి అవకాశం ఉంది. నేరాలు రుజువై శిక్షలు అనుభవించేవారికన్నా ఈ తరహా కేసులను ఎదుర్కునేవారు చాలా దారుణమైన శిక్షను అనుభవిస్తున్నారు. ఇటీవల నిర్బంధంలోనే మరణించిన ఫాదర్ స్టాన్లీ స్వామి విషాద ఉదంతం ఇందుకొక ఉదాహరణ. బీమా కొరెగావ్ కేసులో చిక్కుకుని నానా బాధలూ అనుభవిస్తున్న మేధావులు, హక్కుల నేతలు అత్యంత క్రూరత్వానికి బలవుతున్న దృష్టాంతాలు.

నిర్బంధ రాజ్యాన్ని సాయుధీకరించడం

నిరసనల గొంతు నులిమేయడానికి ఉపయోగిస్తున్న సాధనాలు చూస్తే ఈ దేశంలో ప్రజాస్వామ్యం ఎంత అపహాస్యం అవుతున్నదో కనపడుతుంది. రక్షణ అవసరాలకు మాత్రమే ఉపయోగించడానికి రూపొందిన పెగాసస్ గూఢచర్య సాధనాన్ని వినియోగించడం మీద చెలరేగిన వివాదం ఒక ప్రధాన ఉదాహరణ. అటువంటి సాధనాలద్వారా వ్యక్తిగత గోప్యతకు కలిగే హాని ఏ ప్రజాస్వామ్య వ్యవస్థకైనా ముప్పే. ఈ విషయం మీద సుప్రీం కోర్టు అడిగిన ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం సమాధానం ఇవ్వడానికి నిరాకరించింది. ఆ వివరాలను బహిర్గతం చేయడం దేశ రక్షణకు చేటు తెస్తుందన్న ప్రభుత్వ వాదన చెల్లనిది. ఆ గూఢచర్య సాధనాన్ని కలిగివుండడమే వ్యక్తిగత గోప్యతకు, రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం అని ప్రభుత్వానికి తెలుసు.

## బనిగండ్ల పాడు ఎస్.ఎఫ్.ఐ నూతన కాలేజ్ కమిటీ ఎన్నిక....

ఎర్రుపాలెం నవంబర్ 24 ప్రజాపాలన ప్రతినిధి: మండలంలో బుధవారం నాడు బనిగండ్లపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల యందు ఎస్ ఎఫ్ ఐ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలి. ఎర్రుపాలెం లో కాలేజ్ హాస్టల్ ఏర్పాటు చేయాలి. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం తప్పదు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వడ్రాణపు మధు విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం చెస్తాం. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మధ్యాహ్న భోజనం అమలు చేస్తామని చెప్పి ఇంతవరకు అమలు చేయలేదని ఎస్.ఎఫ్.ఐ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు వడ్రాణపు మధు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం అమలు చేయటంలో ఈ ప్రభుత్వం మొండివైఖరి విడనాడి విద్యార్థులకు న్యాయం చేయాలని, నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్లో ఉన్న ఉపకార వేతనాలు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని, ఎర్రుపాలెం లో కాలేజ్ హాస్టల్ ఏర్పాటు చేయాలని, ప్రహరీ గోడలను ఏర్పాటు చేయాలని, బాత్ రూమ్స్ %ఉ% మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని, ఖాళీగా ఉన్న లెక్చరర్ మరియు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులు భర్తీ చేయాలని, ప్రతి విద్యార్థికి నెలకు వెయ్యి రూపాయలు పాకెట్ మనీ ప్రభుత్వం ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. లేనిపక్షంలో విద్యార్థుల అంతా కలిసి కలెక్టరేట్ ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోఎస్ఎఫ్ఐ నూతన బనిగండ్ల పాడు కాలేజ్ కమిటీ 15 మందితో కమిటీ ఎన్నిక...అధ్యక్ష కార్యదర్శులుగా జాను, మస్తాన్ వలీ ఉపాధ్యక్షురాలు సౌమ్య, సహాయక కార్యదర్శిరాలు కీర్తి, సాయి గణేశ్, వినోద్,రవీందర్, రాజ కుమార్, గోపీచంద్, సాయి కుమార్, హరి, వెంకట్, రాఘవ, అవినాష్, ప్రసాద్ %ాఖీ×% ఎర్రుపాలెం అధ్యక్షుడు నంద్రు శ్రీనివాసరావు నూతన కమిటీనీ అభినందించారు.

# రైతు జీవితాలతో ఆడుకుంటున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు...



ఎర్రుపాలెం నవంబర్ 24 ప్రజాపాలన ప్రతినిధి:మండలం లో బుధవారం రోజున టిపిసిసి ఆదేశాల మేరకు రైతులు పండించిన వరి ధాన్యాన్ని తక్షణమే పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర ఇచ్చి వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ డిప్యూటీ తాసిల్దారు కి వినతి పత్రం అందజేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డ్రామాలు పక్కనపెట్టి ఒకరి మీద ఒకరు నిందలు వేసుకోవటం ఆపి వరి ధాన్యాన్ని కొంటామని రైతులకు భరోసా ఇవ్వాలి. రైతుల బాధలు అర్థం చేసుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు. రైతులు పండించిన వరి ధాన్యం పంటలను ప్రభుత్వం కచ్చితంగా కొనుగోలు చేయాలి. కానీ రాష్ట్రంలో ఎంత పంట వస్తుంది, ఎప్పుడు వస్తుంది అన్న వివరాలు ప్రభుత్వంలో వద్ద లేవు ముందస్తు ప్రణాళిక లేకుండా ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 50 లక్షల ఎకరాల్లో రబీలో సాగుతుందని ప్రభుత్వ అంచనా రబీలో వరి సాగు వద్దని చెబుతున్నా ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటలకు చెంది ప్రణాళిక లేదు. వరి పండే భూముల్లో ఇతర పంటలు పండించడం చాలా కష్టం.62 లక్షల ఎకరాల్లో వరి వేశారని కోటి క్వింటాళ్ల ఉత్పత్తి వస్తుందని ప్రభుత్వం అంచనాలు ఉన్నాయి. పంట చేతికి వచ్చి నెల రోజులు అవుతున్న ప్రభుత్వం కేవలం 11 లక్షల క్వింటాళ్లు మాత్రవే కొనుగోలు చేసింది. రాష్ట్రంలో ఐకేపీ, సహకార సంఘాల ద్వారా 6,772 కొనుగోలు కేంద్రాలు తెరవాల్సి ఉండగా కేవలం 4,743 కేంద్రాలు పేరుకు ఓపెన్ చేశారు. ఇందులో సగం కూడా కొనుగోలు చేయలేదు. ఈ విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి రాష్ట్రంలో రైతుల దగ్గర ఉన్న మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. ధాన్యం కొనుగోలు చేయగానే వీరికి సకాలంలో డబ్బులు చెల్లించాలి. భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి. రాబోయే రోజుల్లో సమగ్ర వ్యవసాయ విధానం అమలు చేసి ధాన్యం రైతులకు భరోసా కల్పించాలని, మరణించిన రైతు కుటుంబాలకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ కడియం శ్రీనివాస రావు, ఎన్నం పిచ్చిరెడ్డి, మధిర నియోజకవర్గ యూత్ యూత్ ప్రధాన కార్యదర్శి దేవరకొండ రాజీవ్ గాంధీ, మేరీ చెన్నయ్య, వేమిరెడ్డి కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కంటి చూపును ఇవ్వడం మరో జన్మ ను ప్రసాదించడమే

**లయన్స్ క్లబ్ జిల్లా సేవల సమన్వయకర్త సింహరాజు కోదండరాం**



వెల్గటూర్, నవంబర్ 24 (ప్రజా పాలన ప్రతినిధి) : కంటిచూపును ఇవ్వడం అంమరో జన్మలో ప్రసాదించడమే, ఈ సమస్యలతో బాధపడే వారికి నేత్ర వైద్య సేవలు అందించి వారిని శాశ్వత అంధత్వం నుంచి కాపాడేందుకు లైన్స్ క్లబ్ సేవల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరం ప్రధానమైనదని లయన్స్ క్లబ్ సేవల జిల్లా కోఆర్డినేటర్ సింహరాజు కోదండరాం అభిప్రాయపడ్డారు. మంగళవారం వెల్గటూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ శిబిరానికి వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో కంటి చూపు తో బాధపడేవారు చికిత్సకోసం వచ్చారు. 200 మందికి పైగా రిజిస్ట్రేషన్ చేసుకోగా వీరిలో 130 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఇందులో 75 మందికి మోతె బిందు (కంటిలో శుక్లాలు) సమస్య ఉన్నట్టు నిర్ధారించడం జరిగింది. వీరిని రేకుర్తి కంటి ఆస్పత్రి లో శస్త్రచికిత్స చేయించదానికి గుర్తించారు. తొలివిడతగా రేకుర్తి కంటి ఆసుపత్రి ప్రత్యేక వాహనంలో 25 మందిని శస్త్రచికిత్సల కోసం ఆస్పత్రికి తరలించారు. మిగతా వారిని విడతలవారీగా శస్త్ర చికిత్సలకు పంపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సింహ రాజు కోదండరాం మాట్లాడుతూ లయన్స్ క్లబ్ చేపడుతున్న అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో నేత్ర వైద్య శిబిరం అత్యంత ప్రధానమైనదని పేర్కొన్నారు. అంతర్జాతీయ సంస్థ అయిన లయన్స్ క్లబ్ ద్వారా నాణ్యమైన నేత్ర వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు లక్షలాది మందికి రేకుర్తి కంటి ఆసుపత్రి ద్వారా శస్త్ర చికిత్సలు చేయించి శాశ్వత అంధత్వం నుంచి విముక్తి కల్పించడం జరిగిందన్నారు. వృద్ధాప్య దశ లో కంటిచూపును ప్రసాదించడం వారికి మరో జన్మ ను అందివ్వడం లాంటిదని పేర్కొన్నారు. మారుతి మెడికల్ స్టోర్ ఆవరణలో జరిగిన ఈ శిబిరంలో వైద్య పరీక్షల కోసం వచ్చిన వారికి మెడికల్ షాప్ యజమానులు కాశ శ్రీధర్, కాశ రవి లు పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ మేరుగు మురళి గౌడ్,కార్యక్రమంలో అధ్యక్షుడు మద్ది మురళీధర్, కార్యదర్శి వైద్య వెంకట్, కోశాధికారి గట్ల రాజేందర్, ఉపాధ్యక్షులు సిరిపురం తిరుపతి, నోముల వెంకట్ రెడ్డి, పి ఆర్ ఓ నక్క సురేష్, డైరెక్టర్ల బోర్డు సభ్యులు బండారి చంద్రమౌళి, తిప్పర్తి పురుషోత్తం, తిప్పర్తి భూమయ్య, సంకోజు నరేష్, గాదాసు రాజేందర్, రేకుర్తి ఆస్పత్రి వైద్య బృందం సభ్యులు ప్రభాకర్, స్వామి, ఆశా కార్యకర్తలు భాగ్యలక్ష్మి, కళ్యాణి.

## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చెయ్యాలి



రాయికల్, నవంబరు 24 (ప్రజాపాలన ప్రతినిధి): రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామంలో బుధవారం రోజున రాయికల్ – ఇటిక్యాల రహదారి పై గ్రామ రైతులు దాదాపు 200 మంది కి పైగా ధర్నా చేశారు.తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలనీ, రోజులు గడుస్తున్నా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయటం లేదని, మిల్లర్ల తాలు తప్ప నూక పేరిట కటింగ్ చేయడం పై నిరసన వ్యక్తం చేసారు. అనంతరం సంఘటన స్థలానికి చేరుకున్న రాయికల్ తహసీల్దార్ కు0దారపు మహేశ్వర్ రైతులకు నచ్చచెప్పి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడం తో రైతులు నిరసన విరమి0ప జేశారు. శాంతి భద్రతలకు ఎలాంటి భంగం కలుగకుండా పోలీసులు పర్యవేక్షించారు .ఈ కార్యక్రమం లో రైతు నాయకులు ఏలేటి జలంధర్ రెడ్డి, ఎల్లాల శేఖర్, మహిపతి రెడ్డి, విజయ్, సత్యం, జీవన్ గడ్డం రాజేందర్, నరసింహ రెడ్డి, రమేష్ ,రాజారెడ్డి, నర్సారెడ్డి, హన్మన్లు ,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతిబాపూలే గురుకుల విద్యార్థినుల ప్రతిభ అమోఘం



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 24 ప్రజాపాలన ప్రతినిధి : ఇబ్రహీంపట్నం మున్సిపల్ పరిధిలోని శేరిగూడ సమీపంలో జ్యోతి బా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. పాఠశాలలో 5వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వం బాలికలకు అన్ని రకాల వసతులు సమ కూర్చబడ్డాయి. నాణ్యమైన విద్య తో పాటు క్రీడలు, సంగీత, సాహిత్యం, చిత్రలేఖనం తదితర అంశాలపై విద్యార్థులు తమ దైన శైలిలో ప్రతిభ కనబరుస్తూ విద్యాలయానికి వన్నె తెస్తున్నారు. ఇందులో భాగంగా కమ్మరి వైష్ణవి 9వ తరగతి సింగింగ్ లో కళా ఉత్సవ్ లో పాల్గొని మెమొంటో అందుకున్నారు. చౌదర్ పల్లి శ్వేత బ్యాండ్, మ్యూజిక్, ఫోక్ లో అదరగొడుతున్నందున ఎన్నో బహుమతులు వరించాయి. అదేవిధంగా ఉప్పల విదర్శిని చిత్రలేఖనంలో వివిధ కళాఖండాలను వేస్తూ చూపరులను అబ్బుర పరుస్తున్నారు. ఉపాధ్యాయినిల సమిష్టి కృషితోనే ఇదంతా సాధ్యం అవుతుందని విద్యార్థులు చెబుతున్నారు. ఈ సందర్భంగా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ రాజమణి మాట్లాడుతూ అన్ని రకాల వసతులు కల్పించి నిష్ణాతులైన ఉపాధ్యాయులచే 800 మంది విద్యార్థినిలకు నాణ్యమైన విద్యను అందిస్తూ సమయానుగుణంగా యాక్టివిటీస్ పైన శిక్షణ ఇస్తూ వారి ప్రతిభను వెలికి తీస్తున్నామని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా శేరిగూడ మెయిన్ రోడ్డు నుండి జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల సుమారు రెండు కిలోమీటర్లు ఉంటుంది రోడ్డు సౌకర్యం కల్పించాలని విద్యార్థిని ల తల్లిదండ్రులు కోరారు. ఈ పాఠశాలకు ప్రహరి గోడ లేక విద్యార్థినిలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలుస్తోంది. దారి పొడవునా విద్యుత్ స్తంభాలు నిర్మించి వాటికి విద్యుత్ బల్బులు ఏర్పాటుచేసినట్లయితే సౌకర్యంగా ఉంటుంది. పాఠశాలకు ప్రహరీ లేనందున బాలికల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పరిశీలించి ప్రహరీ గోడ నిర్మించాలని విద్యార్థినిల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## ఏడు మండలాల ప్రధానోపాధ్యాయలతో జిల్లా విద్యాధికారి సమీక్ష సమావేశం



కోరుట్ల, నవంబర్ 24 (ప్రజాపాలన ప్రతినిధి): కోరుట్ల మండలం మోహన్ రావు పేట గ్రామం శివారు లో గల శ్రీ రామ ఫంక్షన్ హాల్ లో ఏడు మండలాల (మేడిపల్లి, కోరుట్ల, కథలాపూర్, మెట్పల్లి, మల్లాపూర్ ఇబ్రహీంపట్నం, రాయికల్) ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్పెషలాఫీసర్ కేజీబీవీలు, ప్రిన్సిపాల్ మోడల్ స్కూల్ వీరితో జిల్లా విద్యాధికారి జగిత్యాల జగన్మోహన్ రెడ్డి పాఠశాలల రికార్డులు రిజిస్టర్లు నిర్వహణ గురించి, పాఠశాల అభివృద్ధిలో, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తీసుకునే చర్యల గురించి మరియు రాబోయే మార్చి 2021 పరీక్షలకు సంబంధించి పలు సూచనలు సలహాలు అందించారు. ఏడు మండలాల నుంచి 95 మంది ప్రధానోపాధ్యాయులకు 95 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మండల విద్యాధికారి గంగుల నరేశం, రాయికల్ మండల విద్యాధికారి గంగాధర్, సెక్టోరియల్ అధికారి బాలకిషన్,ప్రధానోపాధ్యాయులు అంజా రెడ్డి , సంపత్ కుమార్ చారి పాల్గొన్నారు.

## వరి పంటను మద్దతు ధరకు కొనుగోలు చేసిన వెంటనే చెల్లింపులు జరిపి రైతులను ఆదుకోవాలి



రాయికల్ , నవంబరు 24 (ప్రజాపాలన ప్రతినిధి): వరి పంటను మద్దతు ధరకు కొనుగోలు చేసిన వెంటనే చెల్లింపులు జరిపి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం రోజున రాయికల్ తహసీల్దార్ కుందారపు మహేశ్వర్ కు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్రావు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వరి ధాన్యం పండించిన రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు బాధ్యతలు మాది కాదు అంటే మాది కాదు అంటూ పట్టించుకోకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు, రాష్ట్రంలో 62 లక్షల ఎకరాల్లో వరి సాగు అయిందని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది కేంద్రం ప్రకటించిన మద్దతు ధర జాబితాలో 23 పంటలతో పాటు వరి పంట కూడా ఉంది మద్దతు ధర ప్రకటించడం అంటే ప్రభుత్వం కొనుగోలు చేయడం అని అర్థం అందువల్ల రైతులు పండించిన వరి ధాన్యం పంటను ప్రభుత్వం కచ్చితంగా కొనుగోలు చేయాలి,కానీ రాష్ట్రంలో పంట ఎంత వస్తుంది ఇప్పుడు ఎంత వచ్చింది అన్న వివరాలు ప్రభుత్వం వద్ద లేవు ముందస్తు ప్రణాళిక లేకుండా ఉండడంతో రైతులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు.62 లక్షల ఎకరాలలో వరి వేశారని కోటి క్వింటాల్ల ఉత్పత్తి వస్తుందని ప్రభుత్వం అంచనాలు ఉన్నా పంట చేతికి వచ్చి నెల రోజులు అవుతున్నా ప్రభుత్వం కేవలం 11 లక్షల క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసింది. రాష్ట్రంలో ఐకెపి ,సహకార సంఘాల ద్వారా 6772 కొనుగోలు కేంద్రాలు తెరవాల్సి ఉండగా కేవలం 4743 కేంద్రాలు పేరుకు మాత్రమే ఓపెన్ చేశారు. ఇందులో సగం కూడా కొనుగోలు చేయడం లేదని, లక్ష క్వింటల ధాన్యం నీరు కల్లల్లో రోడ్ల పైన ఉండిపోయి వర్షానికి తడిచి పాడైపోయింది అలాగే దాన్యం వరదలకు కొట్టుకుపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నరని వాపోయారు. ధాన్యం కొనుగోలు చేయగానే వీరికి సకాలంలో డబ్బులు చెల్లించి భారీ వర్షాలు వరదల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి రాబోయే రోజులలో సమగ్ర వ్యవసాయ విధానం అమలు చేసి ధాన్యం రైతులకు భరోసా కల్పించాలని మరణించిన రైతు కుటుంబాలకు పరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రం మహేందర్ గౌడ్ ,కొయ్యడి మహిపాల్ రెడ్డి ,యెద్ధండి దివాకర్రెడ్డి ,యెలేటి జలేందర్రెడ్డి,సూధవేని మురళీగౌడ్ ,కొడి పెల్లి ఆంజనేయులు,వాస0 దిలిప్,ముస్తాక్ అహ్మద్,గ0గా రెడ్డి , భూమయ్య ,రాములు, రాజిరెడ్డి ,బాపురపు నర్సయ్య నాయకులు పాల్గొన్నారు .

## ఇల్లూరు ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు వెంకట్రావు వితరణ



మధిర నవంబ24 ప్రజా పాలన ప్రతినిధిమధిర మండలంలోని ఇల్లూరు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు ,అదే పాఠశాలకు చెందిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు. సుమారు 2800 రూపాయలు విలువ చేసే సోలార్ లైట్లు ఉచితంగా అందచేసినారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ శ్రీ కోట రామారావు మాట్లాడుతూ విద్యుత్ కోత సమయాల్లో ఈ లైట్లను ఉపయోగించుకొని బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు.అనంతరం సోలారులైట్ల దాతను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు గారు, ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

## జీళ్లచెరువు మత్స్య కార్మిక సంఘం ఎన్నిక ఏకగ్రీవం



పాలేరు నవంబర్ 24 ప్రజా పాలన ప్రతినిధి :మత్స్య కార్మిక సంఘం జీళ్లచెరువు గ్రామం కూసుమంచి మండలం ఖమ్మం జిల్లా కొత్త కమిటీని సొసైటీ సంఘ సభ్యుల సమక్షంలో ఎన్నికల అధికారులు జిల్లా సహకార కార్యాలయం అధికారులు వెంకటేశ్వర్లు,మరియు రమణ డైరెక్టర్ ఇంటూరి శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగినది.కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది,సర్పంచ్ ముద్రబోయిన రాంబాబు, ఉప సర్పంచి, సెక్రటరీ లింగన్న బోయిన రామయ్య. డైరెక్టర్స్గోపి హరినాథ్.గోగుల సుబ్బయ్య.ముద్ర బోయిన నాగేశ్వరరావు.లింగనబోయిన సూర్యనారాయణ, తమ్మర బోయిన లక్ష్మయ్య,ముద్ర బోయిన నాగేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ ప్రతి మీటింగ్ కు హాజరు కావాలి హాజరు కాని యెడల మూడు సార్లు చూసి తర్వాత మీటింగ్ లో సంఘం తీర్మానం ప్రకారం తొలగించబడును కొత్త డైరెక్టర్ను ఎన్నుకోవటం జరుతుంది అని అధికారులు సూచించారు

## సిపిఐ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



యాదాద్రి నవంబర్ 24 వలిగొండ ప్రజాపాలన ప్రతినిది మండల పరిధిలోని గుర్నాద్ పల్లి లో అరూర్ పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు వేగంగా సాగడం లేదని,రైస్ మిల్లుల వద్ద దిగుమతులు కాక యజమానులు పేచీలు పెడుతున్నారని అధికారులు స్పందించి వెంటనే ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి పోలేపాక యాదయ్య కోరారు.ఈ కార్యక్రమంలో బుర్ర మల్లేశ్,సాయికుమార్,పాక మహేష్,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## బిగ్ బాస్ ఫేమ్ గంగవ్వ కు ఘన సన్మానం



మంచిర్యాల బ్యూరో, నవంబర్24, ప్రజాపాలన : పాత మంచిర్యాలలో తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో బిగ్ బాస్ సేమ్ గంగవ్వ కు డైరెక్టర్ బాదినేని శ్రీనాథ్ కు ఘనంగా సన్మానించడం జరిగింది ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లంబాడి పల్లె జగిత్యాల జిల్లా కు చెందిన గంగవ యూట్యూబ్ ఛానల్ ద్వారా తన సహజ నటనతో ప్రజలను ఆకట్టుకొని ప్రజల మన్ననలు పొందుతూ సెలబ్రిటీగా మారారని పేర్కొన్నారు. అదేవిధంగా మంచిర్యాల పట్టణానికి చెందిన బాదినేని శ్రీనాథ్ సినీ రంగంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ డైరెక్టర్ స్థాయికి ఎదిగారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్ జిల్లా కార్యదర్శి గుమ్ముల శ్రీనివాస్ పట్టణ అధ్యక్షులు మడుపు రామ్ ప్రకాష్ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి లక్ష్మణ్ ఉపాధ్యక్షులు మేంత్యాల సంతోష్ గంధ శ్రీ తిరుపతి నాయకులు చెంచు గురవయ్య బద్ది శ్రీనివాస్ కొల్లూరు సుధీర్ పూరెల్ల రాజు పానుగంటి బాలకృష్ణ కాసర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు

## జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు మరణించిన కుటుంబానికి నివాళి..



ఎర్రుపాలెం నవంబర్ 24 ప్రజాపాలన ప్రతినిధి: ఎర్రుపాలెం మండలం రామన్నపాలెం గ్రామ సర్పంచ్ కొత్తపల్లి విద్యాసాగర్ రావు గారి తండ్రి కొత్తపల్లి ప్రకాశం గారు అనారోగ్యంతో మరణించడంతో వారి పార్థివదేహానికి నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు గారు. ఈ కార్యక్రమంలో మధిర మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చావా రామకృష్ణ, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు, సర్పంచ్ మొగిలి అప్పారావు, కృష్ణారెడ్డి, ఇనగాలి ఎంపీటీసీ పొట్ట పింజర నరసింహ, రామన్నపాలెం సొసైటీ చైర్మన్ మదన్ మోహన్ రెడ్డి, పురుషోత్తం రాజు, కొండపాక సాంబశివరావు, బుర్ర నారాయణరావు, దేవరకొండ చిరంజీవి, ఇనప నూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# మండల పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రైతు సమస్యలపై కదంతొక్కిన కాంగ్రెస్ పార్టీ



మధిర నవంబర్ 24 ప్రజాపాలన ప్రతినిధిరోజు మధిర మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు లిరేవంత్ రెడ్డిలి,పీసీసీ అధ్యక్షుడు లిమల్లు భట్టి విక్రమార్కలి ఆదేశం తో రైతులు పండించిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కోరుతూ మధిర కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు లిచావా వేణులి మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లిమిరియాల వెంకటరమణ గుప్తాలి అధ్యక్షతన మధిర తాసిల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గారికి వినతిపత్రం అందజేయడం జరిగింది ఈ సందర్భంగా గా వారు మాట్లాడుతూరాష్ట్రంలో వరి ధాన్యం పంటను మద్దతు ధరలు ఇచ్చి పూర్తి స్థాయిలో కొనుగోలు చేసి వెంటనే చెల్లింపులు చేసి రైతులను ఆదుకోవాలని రాష్ట్రంలో వరి ధాన్యం పండించిన రైతుల పరిస్థితి ఆత్యంత దయనీయంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు బాధ్యతలు మాది కాదు అంటే మాది కాదు అంటూ పట్టించుకోకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. లక్షల క్వింటాళ్ల ధాన్యం నేడు కల్లాలల్లో, రోడ్లపైనే ఉండి పోయి వర్షానికి తడిసి పాడైపోయింది. అలాగే ధాన్యం వరదలకు కొట్టుకుపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే ధాన్యం కొనుగోల్లలో జాప్యం, వరదల నష్టాల తదితర సమస్యలతో అన్నదాతలు గుండెపోట్ల తో కొందరు, ఆత్మహత్య లు చేసుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. రాష్ట్రంలో వ్యవసాయ విధానం లేకపోవడంతో రైతులను అయోమయానికి గురవుతున్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి రాష్ట్రంలో రైతుల వద్ద ఉన్న మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలి, ధాన్యం కొనుగోలు చేయగానే వీరికి సకాలంలో డబ్బులు చెల్లించాలి. భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి. రాబోయే రోజుల్లో సమగ్ర వ్యవసాయ విధానం అమలు చేసి ధాన్యం రైతులకు భరోసా కల్పించాలని, మరణించిన రైతు కుటుంబాలకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుంది అన్నారుఈ కార్యక్రమంలో.మధిర నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లితూమాటి నవీన్ రెడ్డిలి మండల అధ్యక్షుడు కిసాన్ సెల్ అధ్యక్షుడు లిదుంప వెంకటేశ్వరరెడ్డిలి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లిఅద్దంకి రవికుమార్లి గ్రామ సర్పంచ్ లిపులి బండ్ల చిట్టిబాబులి మధిర మున్సిపల్ కౌన్సిలర్ లిమునుగోటి వెంకటేశ్వరరావులి మధిర మండల ఐఎన్టియుసి అధ్యక్షుడు లికోరంపల్లి చంటిలి గాంధీ పదం అధ్యక్షుడు లిబోడేపూడి గోపిలి మండల సేవదల్ అధ్యక్షుడు లిఅదురి శ్రీనులి, మండల కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రెటరీ లిఅల్లాడి గోపాల్ రావులి మండల %బా% సెల్ అధ్యక్షుడు లిబాలు నాయక్లి మధిర పట్టణ అధ్యక్షుడు లిషేక్ బాజీలి పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు లిషేక్ జహంగీర్లి పట్టణ %ంఏ% సెల్ అధ్యక్షుడు లిగద్దల లాలయ్యాలి మాజీ సర్పంచ్ లిబొమ్మకంటి హరిబాబులి కాంగ్రెస్ నాయకులు లిఐలూరి సత్యనారాయణ రెడ్డిలి, ముస్లిం వెల్ఫేయిర్ కమిటి అధ్యక్షుడు లిషేక్ మొహమ్మద్ అలీలి లినంపాసల రామకృష్ణ,కోటడేవిడ్,బండారున ర్సింహారావు, కరివేద రాంబాబు,గద్దల విజయ్ ,వనమా పిచ్చియ్య, నిడ మనూరి వంశీ,చెరకు నాగ మురళి కృష్ణ, దొమందుల సురేష్,మైలవరపు చక్రిలి మొదలగువారు పాల్గొన్నారు

## మహిళలకు అండగా రోషిణి వాలెంటరీ ఆర్గనైజేషన్ పనిచేస్తుంది



మధిర నవంబర్ 24 ప్రజాపాలన ప్రతినిధి :మండల రోషిణి వాలంటీర్ ఆర్గనైజేషన్, అధ్యక్షురాలు, %% సుజాతమహిళలకు అండగా రోషిణి వాలంటీర్ ఆర్గనైజేషన్ నిత్యం పనిచేస్తుందని మధిర మండల అధ్యక్షురాలు %% సుజాత చెప్పారు,ఈరోజు మధిరలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు,అధ్యక్షురాలు గా %% సుజాత, ఉపాధ్యక్షురాలుగా, %వీ% మాణిక్యం, ప్రధాన కార్యదర్శి గా, %% ప్రసాదరావు, కార్యదర్శి గా, %బా% సువర్ణ, కోశాధికారి గా %జష్ట్ర% విజయలక్ష్మి, సభ్యులు గా, %బా% లక్ష్మి, %ఖ% అనసూర్య, %ఖ% సువార్త లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగాఅధ్యక్షురాలు సుజాత మాట్లాడుతూ, మహిళలుపై జరుగుతున్నా అత్యాచారాలు మానభంగాలు, అవమానాలు, ఈ నాటికి సమాజములో మహిళలు ప్రతి నిత్యం ఎదుర్కొటున్నారు, వాటిని నివారించేందుకు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తీసుకొచ్చిన అవి ఆగటం లేదని, సుజాత ఆవేదన వ్యక్తం చేశారు,స్త్రీ లను హింసించటం అంతర్జాతీయ మానవ హక్కుల ఉల్లాంఘన కిందకు వస్తుందని ఆమె పేర్కొన్నారు, రాష్ట్ర ప్రభుత్వం షి టీమ్ 181హెల్ప్ లైన్ వంటివి మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిందని చట్టాలు ఎంత కఠినంగా ఉన్న మగవారిలో మార్పు రావడం లేదని ఇంట్లో తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నప్పటినుండే మంచి విషయాలు చెప్పితే వాళ్ళు తప్పుడు మార్గంలో వెళ్లకుండా మార్పు తీసుకురావాలని చూచించారు.

## రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



యాదాద్రి నవంబర్ 24 వలిగొండ ప్రతినిది మండల పరిధిలోని వేములకొండ మూసి పరివాహక ప్రాంతం నుండి వేములకొండకు చెందిన మంటిపెల్లి బిక్షం,మంటిపెల్లి రవేష్ లు ఎలాంటి అనుమతులు లేకుండా మంగళవారం రాత్రి వేళల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న సమాచారం మేరకు స్థానిక పోలీసులు దాడులు నిర్వహించి రెండు ట్రాక్టర్లను పట్టివేసి కేసు నమోదు చెందినట్లు స్థానిక ఎస్సై రాఘవేందర్ బుధవారం తెలిపారు.

## బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాల పట్ల అవగాహన సదస్సు

**ముఖ్య అతిథిగా బోనకల్ ఎస్ఐ తేజావత్ కవిత**





బోనకల్, నవంబర్ 24 ప్రజాపాలన ప్రతినిధి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాల పట్ల అప్రమత్తత గురించి అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ లింగమనేని నళిని శ్రీ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా బోనకల్ ఎస్ఐ కవిత పాల్గొనడం జరిగింది. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బోనకల్ మండలానికి ఒక మహిళ ఎస్సై రావడం సంతోషాన్ని కలుగజేసింది అన్నారు. బోనకల్ మండలంలో ఎక్కువమంది అధికారులు అందరూ మహిళలు కావడం చాలా సంతోషం దాయకం. ముఖ్యంగా బోనకల్ మండలం లో ఉన్నటువంటి మహిళలందరూ తమ సమస్యలను నిర్భయంగా ఎస్ఐ గారికి చెప్పుకోవచ్చును అని తెలియజేశారు. ముఖ్యఅతిథిగా వచ్చినటువంటి ఎస్సై కవిత మాట్లాడుతూ సమాజంలో లో సైబర్ నేరాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి విద్యార్థులు స్మార్ట్ ఫోన్ వాడుతూ ఉన్నారు. ఫేస్బుక్, వాట్సాప్, ఆన్లైన్ షాపింగ్ చేస్తున్నారు. మనకు పరిచయం లేని వ్యక్తులతో చాలా అప్రమత్తంగా ఉండాలి, మోసపోక ముందే వాటి పైన పూర్తి అవగాహన కలిగి ఉండాలి, ఒకవేళ మోసపోతే 155260 లేదా 100 కి కాల్ చేసి సైబర్ నేరాన్ని తెలియజేయండి, ఒకవేళ సైబర్ నేరానికి గురైతే 24 గంటల్లో మాకు సమాచారం అందించినట్లు అయితే పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తాము అని తెలియజేశారు. అంతేకాకుండా విద్యార్థులు యుటిజింగ్ కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యార్థుల్ని హెచ్చరించారు. ప్రతి ఒక్కళ్ళు తమ సోదరి లాగా ఆడపిల్లల్ని గౌరవించాలి అని అన్నారు .ఆడపిల్లలకి ఏదైనా ప్రాబ్లం వస్తే నా నెంబర్ కి కాల్ చేయండి లేదా 100 కి డయల్ చేయండి అని తెలియజేశారు. నేను కూడా ప్రభుత్వ పాఠశాలలోను, కళాశాలోను చదువుకొని ఉద్యోగాన్ని పొందాను. మీరు కూడా ఒక మంచి గోల్ ను ఏర్పరచుకొని బాగా చదువుకొని మీ తల్లిదండ్రులకు గురువులకు పేరు తేవాలని కోరుచున్నాను అని తెలియజేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ మరియు అధ్యాపకులు ఎస్సై గారిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జె. జోనతాన్ బాబు , ఎ. శ్రీనివాస రావు , ఎ. రాజేంద్ర కుమార్, పి. లక్ష్మీకాంతం, డి. పద్మావతి, వి. రామకృష్ణ, యస్.రాజేంద్ర, ఎ. తిరుపతి రావు, ఎ. యు. ఎమ్. కృష్ణ, జి. ధనలక్ష్మి , డి. నాగమణి, శ్రీధర్, రవికుమార్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక సాధనలో ధ్యానమే విశిష్టమైనది

**పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్ మెంట్ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ పితామహ పత్రీజీ**



వికారాబాద్ బ్యూరో 24 నవంబర్ ప్రజాపాలన : ఆధ్యాత్మిక సాధనలో ధ్యానమే విశిష్టమైదని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్ మెంట్ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ పితామహ పత్రీజీ అన్నారు. బుధవారం కోటపల్లి పరిధిలోని నాగుసాన్ పల్లి సమీపంలో గల లైఫ్ యూనివర్సిటీ ( క్వాంటమ లైఫ్ యూనివర్సిటీ ) వ్యవస్థాపకులు చైర్మన్ డాక్టర్ న్యూటన్ జన్మదినం, యూనివర్సిటీ స్థాపన, ధ్యాన యోగ శిక్షార్థుల ముగింపు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పత్రీజీ, డాక్టర్ న్యూటన్ కొండవేటిలు సంయుక్తంగా మాట్లాడుతూ మనిషిలో దాగివున్న ఆధ్యాత్మిక స్వభావపు జ్ఞానం, ప్రేమ, శాంతి, ఆనందం, శ్రేయస్సుల అంతులేని స్థితికి అనుసంధానంగా ఉంటుందని పేర్కొన్నారు. ధ్యాన శాస్త్ర కళను అభ్యసించడం నేటి మానవునికి అత్యంత ఆవశ్యకమని గుర్తు చేశారు. శ్వాస మీద ధ్యాస లగ్నం కఠినతరమైనదని చెప్పారు. మనస్సును ప్రాపంచిక విషయాల వైపు మళ్ళించకుండా క్రమక్రమంగా మనస్సును అదుపులోకి తెచ్చుకోవాలన్నారు. అనంతమైన శక్తి, జ్ఞానం, ప్రేమ, శాంతి, ఆనందాలు అలవడుటకు సుమార్గం ధ్యానమన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, సినీ నటి మంచు లక్ష్మీ ప్రసన్న, పట్టణ అధ్యక్షుడు దావల్గారి ప్రభాకర్ రెడ్డి, యూనివర్సిటీ ఆధ్యాత్మిక గురువులు డాక్టర్ లక్ష్మీ న్యూటన్, ధ్యాన యోగ శిక్షార్థులు తదితరులు పాల్గొన్నారు.


ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు

| | | |
|---|---|---|
| కడమంచి నారాయణ దాస్ | చేవెళ్ల | 9849526878 |
| డి. వరప్రసాద్ | తెల్లాపూర్ | 9553999990 |
| గణేష్ | బాలాపూర్ | 7993047109 |
| నరోత్తమ్‌రెడ్డి | మేడిపల్లి | 9346970159 |
| వెంకటచారి | మందమర్రి | 9440868581 |
| వెంకటస్వామి | మంచిర్యాల | 9515048103 |
| కళ్యాణ్ సి.ఎం. | కూకట్‌పల్లి | 7842672389 |
| ఎం. గైబులు | వికారాబాద్ | 9704570475 |
| జి.వి. శైలజ | శేర్లింగంపల్లి | 8919627871 |
| సత్య కిషోర్ | సిద్దిపేట | 6309723472 |
| బోడ మనోహర్ నంద | కరీంనగర్ | 9492927684 |
| బోడ మమత | జగిత్యాల | 9491127684 |
| రాజేందర్ ప్రసాద్ | ఖమ్మం | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | మధిర | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | పాలేరు | 9848895405 |
| ఆర్.రాజేశ్వర్ రావు | మయూర్ సెంటర్ | 9160400339 |
| మాలేదు నరేందర్ | ఖమ్మం రూరల్ | 8074550397 |
| టిఎస్.చక్రవర్తి | ఖమ్మం టౌన్ | 9948327333 |
| కోన.నరసింహారావు | మధిర రూరల్ | 9949426541 |
| ఆర్.శ్రీనివాస్ | ఎర్రుపాలెం మండలం | 8501020885 |
| బుక్య.శ్రీను | బోనకల్ | 868810293 |
| రత్నకిషోర్ నంద్రు | ఎర్రుపాలెం | 8142196692 |
| సి.మల్లేష్ | ఇబ్రహీంపట్నం | 9618028334 |
| భుక్య శ్రీను | బోనకల్ | 86881020885 |
| సాయికృష్ణ | వైరా | 9951486635 |
| పి.పండు | చేవేళ్ల | 9963293635 |
| గొల్లపూడి దశరధన్ | జిల్లేడు, చౌదరిగూడ | 9951334682 |
| పుప్పాల కిరణ్ కుమార్ | రాజేంద్రనగర్ | 9666603538 |


## శ్రీ లక్ష్మీ ప్రసన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యాచకులకు దుప్పట్లు పంపిణీ



మేడిపల్లి, నవంబర్ 24 (ప్రజాపాలన ప్రతినిధి) : శ్రీ లక్ష్మీ ప్రసన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాత అనురాధ సహకారంతో రోడ్డు పక్కన ఫుట్ పాత్ మీద చలికి ఇబ్బంది పడుతున్న 10 మంది యాచకులకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ ప్రసన్న చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు తమన్ మాట్లాడుతూ రోడ్డు పక్కన ఫుట్ పాత్ పై దేవాలయ దగ్గర వృద్ధులు, అనాధ పిల్లలు ఎంతో మంది చలికి ఇబ్బంది పడుతుండడం చూసి మా ట్రస్ట్ ద్వారా దాతల సహకారంతో 900 మందికి దుప్పట్లు పంపిణీ చేయాలనుకుంటున్నామని తెలిపారు. సహాయం చేయదలచిన దాతలు ఈ ఫోన్ నెంబర్ 9177745159 ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## బావుల పూడికతీత పనులకు నిధులు మంజూరు: ఎంపిడిఓ వెంకట్రామ్ గౌడ్



వికారాబాద్ బ్యూరో 24 నవంబర్ ప్రజాపాలన : గ్రామాలలోని బావుల పూడికతీత పనులకు నిధులు మంజూరు అయ్యాయని ఎంపిడిఓ వెంకట్రావ్ గౌడ్ అన్నారు. బుధవారం మర్పల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక సహాయకులు విట్టల్ రావు సోమలింగం ఎంపిఓ అంజిరెడ్డి ఏపీఓ శ్రావణ్ కుమార్ లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో గ్రామంలోని పేదలకు పశువుల షెడ్లు, అవసరమైనవారికి మేకల షెడ్డు, కొత్త బావుల తవ్వకం మంజూరు చేయుటకు కొరకు మూడు లక్షల 50 వేలు వస్తుందన్నారు. బావులు పూడికతీత తీసుకొనవచ్చునని పేర్కొన్నారు. పంట నూర్పిడి కల్లాలకు 85 వేల రూపాయలు, బావులు పూడికతీత 50 వేల రూపాయల నుండి ఇ లక్ష 50 వేల రూపాయల వరకు మంజూరవుతాయని వివరించారు. పండ్ల తోటల పెంపకం మామిడి జామ బత్తాయి మొదలగు తోటలు మంజూరు చేయబడతాయని స్పష్టం చేశారు. ఎస్సీ ఎస్టీలకు పది ఎకరాల వరకు బిసి ఓసిలకు ఐదు ఎకరాల కంటే గోకులం ఉండరాదన్నారు. ఫారం పాండు కాలువలు తీయుట మొదలగు పనులు మంజూరు చేయబడతాయని తెలిపారు. నూతన నర్సరీలు పెంపకం, మొక్కలు పెంచుటకు విత్తనాలు కొని గ్రామ పంచాయతీలే నర్సరీలలో పెట్టాలని ఎంపిడిఓ పేర్కొన్నారు.

# ధాన్యం సత్వరమే కొనుగోలు చేయాలి



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 24 ప్రజాపాలన ప్రతినిధి : ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుండి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కు బుధవారం ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమం ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జెడల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ రైతుల నుంచి సకాలంలో ధాన్యం కొనుగోలు చేసి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. గత ఎనిమిది రోజులుగా కురుస్తున్న వర్షాలకు తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని ప్రత్యేకమైన కమిటీ వేసి రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గురునాథ్ రెడ్డి, చర్లపటేల్ గుడ ఎంపీటీసీ ఆంజనేయులు, నరెందర్, శ్రీనివాస్ రెడ్డి, సామల రవీందర్ రెడ్డి, రైతు చెరుకూరి కిషన్, రవి నాయీ బ్రాహ్మన్ తదితరులు పాల్గొన్నారు.

## పోల్కంపల్లి జడ్.పి.హెచ్.ఎస్ లో మాక్ పోలింగ్



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 24 ప్రజా పాలన ప్రతినిధి : బుధవారం ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే బుధవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పోలింగ్ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఏ విషయాలపై అవగాహన పెంచుకోవాలి, ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలని విషయాలపై మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ పాండురంగం, గ్రామ ఉపసర్పంచ్ కొమ్మిడి జంగా రెడ్డి, ఎంపీటీసీ చెరుకూరి మంగా రవీందర్, వార్డ్ మెంబర్స్, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు శ్రీనివాస్ నాయుడు, ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

# నేను పుట్టి పెరిగిన ప్రపంచం..



బిఎన్.రాములు

## మా లోకం

మేము మా జీవితం గెలిచేందుకు అమ్మ తాను ఓడిపోయే ఆటలు ఆడింది. "పచ్చీసు" ఆట తానే నేర్పింది. వంటలు వండడం, అలుకు చల్లి ముగ్గులేయడం అలానే నేర్పింది. అమ్మంటే ప్రేమతో పనులపై కూడా శ్రద్ధా, ప్రేమా, గౌరవం కలిగాయి. అమ్మ తన జీవితాన్ని ఓడిపోయి మా జీవితాన్ని గెలిపించింది. మా గెలుపులో తన గెలుపు రూపాన్ని చూసుకుంది అమ్మ.

అమ్మ మళ్ళీ పెళ్ళి చేసుకొంటే మా భవిష్యత్తు ఏమిటనే భయం వెన్నాడింది. అమ్మతో రెండో నాన్న వెంట వెళ్తే కూలిపని చేయిస్తాడు. అమ్మ ఆసరాలేని ప్రపంచం చిమ్మచీకటి. అమ్మ మా కోరికకే ఓటేసింది. మారుమనువు సంబంధాలన్నీ తిప్పి పంపింది. నాన్నను తలుచుకుంటూ మమ్మల్ని అక్కున చేర్చుకుని ఏడ్చింది. అప్పటికి అన్నకు తొమ్మిదేళ్ళు ఇవన్నీ మా అన్న జీవితంపై బలమైన ప్రభావం వేశాయి. అప్పుడు నాకు ఆరేళ్ళు. తమ్ముడికి మూడేళ్ళు. మాకు పెద్దగా తెలియదు.

నాన్న పోయేనాటికి అమ్మకు ఇరవై ఐదేళ్ళు.

నాన్నపోయాక అమ్మను మారుమనువు (మారుపెళ్ళి) అడిగారు. మాకు అమ్మ కావాలి. ఎన్నో రాత్రులు ఏడ్చి ఏడ్చి ఆకలితో నిద్రపోయాం. అమ్మ మళ్ళీ పిల్లలు కనడానికే మారు మనువు అని అర్థమైంది. తాత అమ్మమీది ప్రేమతో మారుమనువు సంబంధాలు వెతికాడు.

అమ్మ వ్యవసాయ పనులకు కూలికి వెళ్ళేది. బట్టలు నేసే మగ్గం సామాగ్రి అంతా యింట్లో ఉంది. ఆ పని కుటుంబం అంతా కల్సి చేస్తే కాని సాగని పని. నాన్నలేడు. అన్నను చదివించాలని అమ్మ తపన. నేతపని ఎంతైనా నీడపట్టున యింట్లో చేసికొనే పని. వ్యవసాయపు పనికి ఊరుదాటి రెండు కిలోమీటర్లు దాటి నడిచి వెళ్లాలి. పదిమందితో పాటు పని. పదిమందిలోంచి నడవాలి. పదిమంది నీచపు చూపుల్లో పడాలి. కూలి ఏ పూట దొరుకుతుందో, ఏ పూట దొరకదో తెలియదు. పని చేయించుకునే రైతులు పనిచెయ్యమని ఎద్దును పొడిచినట్టు సూటిపోటి మాటలు, బూతు తిట్లు. అమ్మకు యివేవీ యిష్టం ఉండేది కాదు. పుట్టిన్నించి తల్లిగారిల్లు, అత్తగారిల్లు అంతా తన యింట్లోనే. ఎంతో అభిమానవతి అమ్మ.

పోరాటం ఎక్కడో లేదు. బతుకులోనే పోరాటం ఉంది. మా బతుకే ఒక పోరాటం. ఒక స్థాయి బతుకు బతకడమే ఒక పోరాటంగా సాధించుకోవాల్సిన జీవితాలు మావి. మా అమ్మ బతుకే ఒక పోరాటం. నేను అమ్మచాటు పిల్లడిగా పెరిగాను. అమ్మవెంట అమ్మలక్కల మధ్య పెరిగాను. స్త్రీల సమాజంలో పెరిగాను. నేను అమ్మ జీవితాన్ని ఎరువుగా తీసుకుని ఎదిగిన మొక్కను. అమ్మ చేసే త్యాగం ఆమె కని, పెంచిన పిల్లలకైనా అర్థం అవుతుందా... ఆ త్యాగం చిన్నప్పుడు మాకు అర్థం కాలేదు.

జ్ఞాపకాలు వాస్తవ జీవితం కాదంటారు. చరిత్రంతా జ్ఞాపకాల తాలూకు వాస్తవాలే! జ్ఞాపకాలు వాస్తవాలు కాకపోయినా వాస్తవంగా తిరిగి రూపుదిద్దుకునే అవకాశం ఉంటుంది. వర్తమానాన్ని ప్రభావితం చేస్తాయి.

(మిగతాభాగం రేపటి సంచికలో..)

## గోవిందపురం ఎల్ గ్రామం లో పర్యటించిన వ్యవసాయ అధికారులు



బోనకల్, నవంబర్ 24 ప్రజా పాలన ప్రతినిధి: మండల పరిధిలోని గోవిందపురం ఎల్ గ్రామంలో మిర్చి లో కొత్త రకం వైరస్ వలన నష్టపోయిన పంటలను ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు సందర్శించారు. మంగళవారం గోవిందాపురం ఎల్ గ్రామంలో సిపిఐ బృందం పర్యటించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అధికారులు వెంటనే గ్రామానికి రావాలన్నా విజ్ఞప్తితో బుధవారం మండల వ్యవసాయ అధికారి అబ్బూరి శరత్ బాబు, ఉద్యానవన శాఖ అధికారి ఆకుల వేణులు గోవిందపురం, లక్ష్మీ పురం గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల కారణంగా ఈ నల్ల తామర పురుగులు ఏర్పడ్డాయని వాతావరణంలో మార్పులతో నే ఈ పురుగులు కూడా పోతాయన్న అంచనాల్ని శాస్త్రవేత్తలు అంచనా వేశారన్నారు. ఉద్యానవన శాఖ అధికారి వేణు మాట్లాడుతూ ఎక్కువ ఖరీదు గల మందులు వాడకుండా స్పైరోటెట్రా మైట్( మెమెంటో)1.25 మీ.లి/లీటర్ నీటికి, స్పైనోసాడ్( ట్రెసర్)04.మీ .లి/లీటర్ నీటికి,క్లోరోపేనఫైర్ (ఇంటర్ ప్రీడ్) 2 మీ. లి/లీటర్ థియాక్లోప్రీడ్(అలాంటో) 2-మీ.లి /లీటర్ నీటికి స్పైనోటోరం (డిగిలెట్) 2 మీ లి/ లీటర్ నీటికి వేపనునే (10000పిపిఎం) 3మీ.లి / లీటర్ నీటికి మందులను పిచికారీ చేస్తే ఫలితం ఉందని శాస్త్రవేత్తలు తెలియజేయడం జరిగింది. రైతులు అనవసరంగా ఖరీదు గల మందులు ఉపయోగించకుండా సేంద్రియ పద్ధతుల్లో తక్కువ ఖరీదు ఉన్న మందుల్ని వాడాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. అధికారుల వెంట తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఏ ఐ కె ఎస్ జిల్లా కార్యదర్శి జక్కుల రామారావు, తెరాస నాయకులు ఉమ్మినేనీ కృష్ణ చింతలచెరువు లక్ష్మీనారాయణ, సీపీఎం నాయకులు ఉమ్మినేని రవి, జొన్నలగడ్డ శ్రీనివాసరావులతో పాటు రైతులు ఎర్ర పైన నాగేశ్వరావు, నల్లమోతు నరేష్, రావూరి వెంకటయ్య ,చింతలచెరువు మాధారయ్య, ఎస్ కె బడే బాబు తదితరులు పాల్గొన్నారు.

## పల్లపోతుపసాద్ 33వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ఆర్య వైశ్యులు



మధిర నవంబ24 ప్రజా పాలన ప్రతినిధి మధిర సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య సంక్షేమ సంఘం కన్వీనర్ మరియు టిఆర్ఎస్ నాయకులు పల్లపోతు ప్రసాద రావు ధర్మపత్ని రాజ్యలక్ష్మి 33 వ వివాహ మహోత్సవం సందర్భంగా అనాధ వృద్ధాశ్రమంలో అనాధ వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకోవడం జరిగింది. ఈరోజు మధ్యాహ్నం 12 గంటలకు రెస్క్యూ టీం ఆర్కే ఫౌండేషన్ రామకృష్ణ నిర్వహిస్తున్నటువంటి అనాధ వృద్ధాశ్రమంలో అన్న వితరణ చేయడం జరిగింది ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ నా పెళ్లిరోజు శుభాకాంక్షలకా తెలిపిన వారి అందరికీ పేరుపేరునా అభినందనల్ను తెలుపుతున్నాను ఈ కార్యక్రమం లో కుటుంబ సభ్యులు పల్లపోతు స్వాతి, పల్లపోతు బాలసుబ్రమణ్యం, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు శ్రీ ఇరుకుళ్ళ లక్ష్మీ నరసింహారావు , మధిర సేవాసమితి బాధ్యులు మిరియాల కాశీ విశ్వేశ్వర రావు కోమటీడి శ్రీనివాసరావు ర్రా లక్ష్మణ్ రావు చారుగుండ్ల నరసింహమూర్తి కోమటి సుధాకర్ జంగా నరసింహా రెడ్డి లాయర్ వాసుదేవరావు వాసవి క్లబ్ బాధ్యులు ఇరుకుళ్ళ సురేష్ చల్లా సత్యనారాయణ టిఆర్ఎస్ నాయకులు మహంకాళి వెంకట శ్రీనివాస రావు వంగవీటి రాజుతదితరులు పాల్గొని పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేసినారు.ఇరుకుళ్ళ లక్ష్మీ నరసింహారావు మాట్లాడుతూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నటువంటి మీ జంట సమాజానికి మార్గదర్శకంగా ఉండి మునుముందు మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ మధిర ప్రజల మన్ననలు పొందాలని ఆశీర్వదించినారు

## కొత్తపల్లి ప్రకాశానికి నివాళులర్పించిన డాక్టర్ కోటా రాంబాబు



ఎర్రుపాలెం నవంబర్ 24 ప్రజాపాలన ప్రతినిధి:ఎర్రుపాలెం మండలం రామన్నపాలెం గ్రామంలో గ్రామ సర్పంచ్ కొత్తపల్లి విద్యాసాగర్ రావు తండ్రి కొత్తపల్లి ప్రకాశం అనారోగ్యంతో మరణించడం తో వారి పార్థివదేహానికి నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన టీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు డా. కోటా రాంబాబు. ఈ కార్యక్రమంలో కూరపాటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సైబర్ క్రైమ్ పై అవగాహన సదస్సు నిర్వహించిన కొడిమ్యాల ఎస్ఐ శివాని రెడ్డి



కొడిమ్యాల, నవంబర్ 24 (ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలోని మంగళవారం రోజున మాడల్ స్కూల్లో విద్యార్థులకు జిల్లా ఎస్పీ సింధూశర్మ ఆదేశాలమేరకు కొడిమ్యాల ఎస్ ఐ.శివాని ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సంధ్భంగా ఎస్ఐ శివాని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సెల్ ఫోన్ ల వినియోగంపట్ల జాగ్రత్త గా వుడాలని అనవసరమైన సైట్లు ఓపెన్ చేసి సైబర్ నేరాలకు పాల్పడ వద్దని, మైనర్ పిల్లలు సెల్ ఫోన్ మాట్లాడుతు అతివేగంగా డ్రైవింగ్ చేసి ప్రమాదాలకు గురి కావద్దని, విద్యార్థినీలు మహిళలు ఎలాంటి బెదిరింపులకు,వేదింపులకు గురైనా 100 కు గానీ,1089 చైల్డ్ లైన్ నం"లకు గాని డైల్ చేసిసహాయం పొందాలనిసూచించారు..ఈకార్యక్రమంలో సైబర్ మెంబర్, జె. శ్రీధర్, పాఠశాల ఇంచార్జీ రజిని, స్కూల్ టీచర్స్,విధ్యార్థులు. పాల్గొన్నారు.

## నూతన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ను పంచాయతీ ఆందోల్ డివిజన్ సిబ్బంది సత్కరించారు



హైదరాబాద్ 24 నవంబర్ ప్రజాపాలన ప్రతినిధి: పంచాయతీ రాజ్ ఆందోల్ డివిజన్ నూతన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా బాధ్యతలు చేపట్టిన అంజయ్య తాల్క.సంగారెడ్డి జిల్లాపంచాయతీ రాజ్ సబ్ డివిజన్ సిర్గాపూర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కు ఆందోల్ డివిజన్ పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా అదనపు బాధ్యతలు అప్పగించారు. బుధవారం నాడు ఉదయం ఆందోల్ డివిజన్ పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా అంజయ్య తాల్క అదనపు బాధ్యతలు చేపట్టారు.

## కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్లే అన్నదాతకు ఇబ్బందులు ఎమ్మెల్యేసంజయ్



జగిత్యాల, నవంబర్ 24 ( ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల రూరల్ మండల హబ్సిపూర్, సంఘం పల్లి గ్రామాలలో ప్యాక్స్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ సందర్శించినారు. అనంతరం దాన్యం కొనుగోలులో జాప్యంపై రైతులతో మాట్లాడి, సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించగా ఆధార్ కార్డ్ ఫోన్ కి లింక్ ఉండాలని ఫోన్ కి వచ్చిన ఓటిపి ని రైతులు నిర్వాహకులకు తెలపాలని లేని పక్షంలో దాన్యం కొనుగోలు చేయరాదని అన్నారు. ఆధార్ అనుసంధానం లేక రైతులకు ఇబ్బందులు వస్తున్నాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్లే అన్నదాతకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు, తెలంగాణ ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమని, రైతుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ సందీప్ రావు, సర్పంచులు రాజేశ్వర్ రెడ్డి, అంకతి మల్లవ్వ మల్లయ్య, మాజీ జడ్పీటీసీ ఎల్లారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ స్వామి అయ్యప్ప దేవాలయం 14వ మండల పూజ కార్యక్రమాలు



మధిర నవంబర్ 24 ప్రజా పాలన ప్రతినిధి మధిర నందు 14వ ఉత్సవ కార్యక్రమములు కార్తీక మాసం మూడో బుధవారం 14వ వార్షికోత్సవం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈరోజు నుండి24 11 2021 నుండి 01:12 2021 వరకు నిర్వహించడం జరుగుతున్నది అందులో భాగంగా ఈరోజు 06:45 ప్రసాద శుద్ధి వాస్తు బెలి మూల పూజ ధ్వజారోహణం సివేలి తదుపరి గ్రామోత్సవం గా గ్రామంలో నాలుగు ప్రాంతాలలో ధ్వజారోహణం నిర్వహించడం జరుగుతుంది దాతల సహకారంతో మధ్యాహ్నం మాల దారులకుఅన్నదాన కార్యక్రమం జరిగిందని అదే రోజు సాయంత్రం దాతల సహకారంతోఎనిమిది గంటలకు శ్రీ స్వామి వారి పడిపూజ భజన తదుపరి బిక్ష కార్యక్రమం నిర్వహించడం జరుగుతున్నది ఆలయ కమిటీ తెలిపిందిఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదములు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కాగల ఈ కార్యక్రమంలో చలవాదిశ్రీనివాస్ మున్సిపాలిటీ కౌన్సిలర్ వంకాయలపాటి బాబు నాగేశ్వరావు శివాలయం చైర్మన్ వంకాయల పాటి నాగేశ్వరావు చలవాది మురళి బత్తుల శ్రీనివాసరావు రమేష్ పసుపులేటి నాగేంద్ర శ్రీనివాసరావు.

## షరతులు లేకుండ వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలి: కాంగ్రెస్ నేతలు తహశీల్దార్లకు వినతిపత్రాలు



బీరుపూర్/సారంగాపూర్, నవంబర్ 24 (ప్రజాపాలన ప్రతినిధి): సారంగాపూర్ బీరుపూర్ మండలాల కాంగ్రెస్ నాయకులు తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు.తప్పతాలు పేరుతో ఎలాంటి కటింగ్ లేకుండ వరి ధాన్యాన్ని మద్దతు ధరతో తడిసిన ధాన్యాన్ని కూడ కొనుగోలు చేయాలని కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని మరియు అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీరుపూర్ తహశీల్దార్ అరిఫోద్దీన్ సారంగాపూర్ తహశీల్దార్ శ్రీలతకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీరుపూర్ ఎంపీపీ మసర్తి రమేష్ జడ్పీటీసీ పాత పద్మారమేష్ ప్రచార కార్యదర్శి గుడిసె జితేందర్ యాదవ్ పోల్సాని నవీన్ రావు పూడూరి రవి సారంగాపూర్ బీరుపూర్ పార్టీల అధ్యక్షులు చేరుపురి శుభాష్ కొండ్ర రాంచందర్ రెడ్డి జోగి రెడ్డి బదినపల్లి శంకర్ యశోద శ్రీనివాస్ చీర్నేని శ్రీనివాస్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీరుపూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం...



బీరుపూర్, నవంబర్ 24 (ప్రజాపాలన ప్రతినిధి): బీరుపూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో సిగ్మా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో దాదాపు 200 మంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు ఆరోగ్య పరమైన ఏమైన సమస్యలు ఉంటే సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఘర్షకుర్తి శిల్పారమేష్ కార్యదర్శి సతీష్ వైద్యులు అఫ్రోజ్ క్యాంపు ఇంచార్జి మేనేజర్ గణేష్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీరుపూర్ మండల్ ఎమ్మార్పీఎస్ యువసేన అధ్యక్షునిగా సుధాకర్



బీరుపూర్, నవంబర్ 24 (ప్రజాపాలన ప్రతినిధి) బీరుపూర్ మండల్ ఎమ్మార్పీఎస్ యువసేన అధ్యక్షునిగా మోతె సుధాకర్ మాదిగను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం మాదిగ జిల్లా నాయకులు బెజ్జంకి సతీష్ మాదిగ నీయమకపు పత్రాన్ని అందజేశారు. సుధాకర్ మాట్లాడుతూ ఏబీసీడి వర్గీకరణ కోసం మాదిగ ఉప కులాల యువతను చైతన్య పర్చి ఉద్యమాన్ని ఉధృతం చేస్తానని తెలిపారు. నా ఎన్నికకు సహకరించిన సీనియర్ ఎమ్మార్పీఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## హై-స్పీడ్ రైలు కారిడార్ అభివృద్ధికి ప్రజాభిప్రాయం: జిల్లా కలెక్టర్ నిఖిల



వికారాబాద్ బ్యూరో 24 నవంబర్ ప్రజాపాలన : హైదరాబాద్ నుండి వికారాబాద్ మీదుగా ముంబై వరకు హై-స్పీడ్ రైలు కారిడార్ అభివృద్ధి కొరకు ఈనెల 25న (గురువారం) రోజు స్థానిక అంబేద్కర్ భవనములో ఉదయం 11:00 గంటలకు పర్యావరణ మరియు సామాజిక అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ నిఖిల తెలియజేసినారు. హై - స్పీడ్ రైలు కారిడార్ కొరకు ఏర్పాటు చేసిన ఇట్టి ప్రజాభిప్రాయ సేకరణలో జిల్లాలోని అన్ని మండలాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేయాలనీ కలెక్టర్ కోరారు.

# రోజు వారి విటమిన్ ఇస్తున్న క్యూటీ



మాలీవుడ్ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ టాలీవుడ్ లో పెద్ద హీరోయిన్ అవుతుందని చాలా మంది భావించారు. కానీ ఆ అంచనాలన్ని తప్పు అయ్యాయి. అనూహ్యంగా అనుపమ కెరీర్ మలుపు తిరిగింది. ప్రేమమ్ తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన బ్యూటీ పెద్ద స్టార్ హీరోయిన్ కాలేకపోయింది. మీడియం రేంజ్ హీరోలకే పరిమితమైంది. ఆరకంగాను పెద్దగా అవకాశాలు రావడం లేదు. ప్రస్తుతం అమ్మడి చేతిలో రౌడీ బోయ్స్, కార్తికేయ -2 చిత్రాలు మాత్రమే ఉన్నాయి. రౌడీబోయ్స్ త్వరలో రిలీజ్ కాబోతుంది. ఈ సినిమాపైనే అమ్మడు ఆశలు పెట్టుకుంది.ఆ సంగతి పక్కనబెడితే ఈ మల్లూ బ్యూటీ హెయిర్ స్టైల్ కి ఇటీవలే విజయ్ దేవరకొండ ఫిదా అయిన సంగతి తెలిసిందే. రౌడీబోయ్స్ లో అనుపమ రింగుల హెయిర్ స్టైల్లో స్పెషల్ అట్రాక్షన్ కానుంది. ఈ హెయిర్ స్టైల్ ని ఉద్దేశిస్తూ విజయ్ సూపర్బ్ అనే కామెంట్ కూడా చేసారు. రౌడీబోయ్స్ కోసం అనుపమని కొత్త లుక్ లో లాంచ్ చేసినట్లు తెలుస్తోంది. హెయిర్ ట్రిమ్ చేసి రింగుల జుత్తు లోనే కొత్త లుక్ ట్రై చేసారు. ఈ లుక్ ఫ్రెష్ ఫీల్ ని తీసుకొచ్చింది. తాజాగా ఈ బ్యూటీ హెయిర్ మరోసారి హైలైట్ చేస్తూ కొత్త ఫోటో సెషన్లో పాల్గొంది. క్రాక్ టాప్ క్యామిసోల్ ర్యాప్ డ్రెస్ లో ఆకర్షణీయంగా కనిపిస్తోంది.మల్లూ బ్యూటీ అనుపమ మరో హాట్ కామెంట్ కూడా విసిరింది. ఇదిగో మీ రోజువారి విటమిన్ మీ అంటూ క్యాప్షన్ ఇచ్చింది. దీంతో ఆ ఫోటోతో పాటు కామెంట్ వైరల్ గా మారింది. సోషల్ మీడియాలో అనుపమ అభిమానులు కామెంట్లతో..ఎమోజీలతో ఎటాక్ చేసారు. ఏది ఏమైనా? రౌడీబోయ్స్ కి ఇదో రకమైన ప్రచారం అనాలేమో. ప్రస్తుతం ఈ సినిమాకి బజ్ తీసుకొచ్చే ప్రయత్నాలు సీరియస్ గానే సాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రాజుగారు అనుపమని ప్రచారం పరంగా ఇలా రంగంలోకి దించుతున్నారని తెలుస్తోంది. 2021-22 సీజన్ అనుపమకు అన్నిరకాలా కలిసొస్తున్నట్టే అనిపిస్తోంది. ప్రస్తుతం నిఖిల్ సరసన జీఏ2 సంస్థ నిర్మిస్తున్న 18 పేజెస్ లో నటిస్తోంది. నిఖిల్ కార్తికేయ 2లోను నటిస్తోంది. చందు మొండేటి ఈ చిత్రానికి దర్శకుడు. అలాగే తమిళంలో తల్లి పోగతే విడుదల కావాల్సి ఉంది. హెలెన్.. తలై నగరమ్ 2 అనే చిత్రాల్లోనూ నటిస్తోంది.

## అక్కడ బన్నీ కెరీర్ లోనే గ్రాండ్ గా "పుష్ప" రిలీజ్.!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా రష్మికా మందన్నా హీరోయిన్ గా దర్శకుడు సుకుమార్ తెరకెక్కిస్తున్న భారీ సినిమా "పుష్ప" కోసం అందరికీ తెలిసిందే. భారీ అంచనాలు నెలకొల్పుకున్న ఈ చిత్రం పనులు అన్నీ శరవేగంగా జరుపుకుంటుంది. అలాగే ఇంకో పక్క సాలిడ్ ట్రైలర్ కట్ మరియు ప్రీ రిలీజ్ కి రంగం సిద్ధం చేస్తుండగా..ఈ సినిమాని అల్లు అర్జున్ కెరీర్ లోనే భారీ లెవెల్ రిలీజ్ గా ఓవర్సీస్ మార్కెట్ లో రిలీజ్ చెయ్యాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. అంతే కాకుండా ఓవర్సీస్ లో పెద్ద మొత్తంలోనే పుష్ప పార్ట్ 1 కి బిజినెస్ కూడా జరిగిందట. అందుకే బన్నీ గత సినిమాలను మించి ఎక్కువ థియేటర్స్ లో పుష్ప రిలీజ్ ప్లానింగ్ జరుగుతున్నట్టు టాక్. మరి దీని పై మరింత సమాచారం రావాల్సి ఉంది.

## శంకర్ సినిమా సెట్స్ నుంచి స్టైలిష్ లుక్స్ లో చరణ్.!



మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం విజనరీ దర్శకుడు శంకర్ తో ఓ భారీ పాన్ ఇండియన్ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఆల్రెడీ ఓ షెడ్యూల్ ని విజయవంతంగా పూర్తి చేసి ఇప్పుడు రెండో షెడ్యూల్ ని కూడా స్టార్ట్ చేసేసారు. మరి ఈ గ్యాప్ లోనే సినిమాలోని ఫైట్స్ కి సంబంధించి కొన్ని ఫోటోలు బయటకొచ్చి వైరల్ కాగా ఇప్పుడు చరణ్ వి కొన్ని ఆన్ సెట్స్ ఫోటోలు బయటకొచ్చి వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం శంకర్ లో విజువల్ ట్రీట్ ఇచ్చే తన మార్క్ సాంగ్ ని చిత్రీకరిస్తుండగా అందులో చరణ్ లుక్స్ బయటకొచ్చాయి. మరి వీటిలో చూస్తే శంకర్ మళ్ళీ ఆరెంజ్ నాటి స్టైలిష్ చరణ్ ని ప్రెజెంట్ చేయబోతున్నట్టు అర్ధం అవుతుంది. మరి సినిమాలో ఎలా ఉంటాడో చూడాలి ఇక. ఈ చిత్రంలో చరణ్ సరసన కియారా అద్వానీ హీరోయిన్ గా నటిస్తుండగా థమన్ సంగీతం అందిస్తున్న సంగతి తెలిసిందే. అలాగే దిల్ రాజు ఈ చిత్రాన్ని నిర్మాణం వహిస్తున్నారు.

## సర్కారు వారి పాట" సూపర్ ఫిల్మ్..కాన్ఫిడెన్స్ లెవెల్స్.!



సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా కీర్తి సురేష్ హీరోయిన్ గా దర్శకుడు పరశురామ్ పెట్ల తెరకెక్కిస్తున్న భారీ చిత్రం "సర్కారు వారి పాట" కోసం అందరికీ తెలిసిందే. మహేష్ కెరీర్ లోనే మంచి మోస్ట్ అవైటెడ్ గా వస్తున్న ఈ చిత్రాన్ని నెక్స్ట్ లెవెల్లో చిత్ర యూనిట్ ప్రెజెంట్ చేస్తున్నారు.మరి ఇదిలా ఉండగా ఈ సినిమాపై సంగీత దర్శకుడు థమన్ చేసిన కామెంట్స్ మరింత కాన్ఫిడెన్స్ ని పెంచుతున్నాయి. సినిమా సాంగ్స్ అప్డేట్స్ కోసం మాట్లాడుతూ ఇది సూపర్ ఫిల్మ్ అని ఎక్కడా డౌట్ లేకుండా చెప్తున్నాడు అంతే కాకుండా సాంగ్స్ ఈపాటికే రావాల్సింది.కానీ ఏప్రిల్ రిలీజ్ అవ్వడం వల్ల సాంగ్స్ ని జనవరి నుంచి రిలీజ్ చేస్తున్నట్టుగా కూడా థమన్ క్లారిటీ ఇచ్చాడు. థమన్ కి ఈ లెవెల్ కాన్ఫిడెన్స్ ఉంది అంటే సినిమా అదిరిపోయిందనే లెక్క. ఇక సిల్వర్ స్క్రీన్ పై మహేష్ డబుల్ హ్యాట్రిక్ కి దీనితోనే నాంది పలికినట్టే అని చెప్పాలి.

## కాస్త ముందుగానే పలకరించనున్న "దృశ్యం 2".?



విక్టరీ వెంకటేష్ హీరోగా నటించిన లేటెస్ట్ అండ్ మోస్ట్ అవైటెడ్ సినిమా "దృశ్యం 2". తన కెరీర్ లో మంచి హిట్ అయినటువంటి దృశ్యం కి సీక్వెల్ గా తీసిన ఈ చిత్రం నేరుగా ఓటిటి లోనే రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే. దర్శకుడు జీతూ జోసెఫ్ తెరకెక్కించిన ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్ లో ఈ నవంబర్ 25న వరల్డ్ ప్రీమియర్ గా రిలీజ్ కానుంది. అయితే గత చిత్రాల్లానే ఈ సినిమా కూడా కాస్త ముందే స్ట్రీమింగ్ ప్రీమియర్స్ కి రానున్నట్టు తెలుస్తుంది. అంటే ఈరోజు రాత్రి 10 గంటల నుంచే అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ చిత్రం స్ట్రీమింగ్ కు రావచ్చుట. లాస్ట్ టైం కూడా "నారప్ప" ఇలానే స్ట్రీమింగ్ కి వచ్చింది. మరి దృశ్యం కూడా ముందే పలకరిస్తుందో లేక 12 గంటలకే వస్తుందో చూడాలి. ఇక ఈ చిత్రంలో మీనా, నదియా, సంపత్ లు కీలక పాత్రల్లో నటించగా సురేష్ ప్రొడక్షన్స్ వారు నిర్మాణం వహించారు.



## ఇండియా లోనే నంబర్ వన్ హీరోగా ప్రభాస్..!

బాహుబలి సిరీస్ చిత్రాల తర్వాత ప్రభాస్ రేంజ్ అమాంతం పెరిగింది. వరుస పాన్ ఇండియా సినిమాలు చేస్తూ బాలీవుడ్ లో సైతం తన సత్తా చాటుతున్నారు ప్రభాస్. బాహుబలి అనంతరం వచ్చిన సాహో చిత్రం సైతం టాక్ తో సంబందం లేకుండా బాలీవుడ్ లో కలెక్షన్ల సునామీ సృష్టించింది. అయితే ప్రభాస్ చేసే ప్రతి ఒక్క సినిమా కూడా పాన్ ఇండియా లేదా పాన్ వరల్డ్ గా మారుతోంది.ఇప్పటి వరకూ బాలీవుడ్ లో మాత్రమే ఎక్కువ రెమ్యునరేషన్ కలిగి ఉన్న స్టార్స్ సైతం ప్రభాస్ ఫ్యాన్ ఫాలోయింగ్ ను చూసి అవాక్కు అవుతున్నారు అని చెప్పాలి. ప్రభాస్ తను చేసే ప్రతి ఒక్క సినిమా కు కూడా 100 కోట్ల రూపాయల కి పైనే రెమ్యునరేషన్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. తాజాగా సందీప్ రెడ్డి వంగా చిత్రానికి ప్రభాస్ ఓకే చెప్పిన సంగతి తెలిసిందే. స్పిరిట్ అంటూ సరికొత్త పోస్టర్ తో చిత్ర యూనిట్ టైటిల్ ను ప్రకటించడం జరిగింది. ఈ చిత్రం కి ప్రభాస్ 150 కోట్ల రూపాయల పారితోషికం తీసుకుంటున్నట్లు టాక్.ప్రభాస్ ప్రస్తుతం సలార్ మరియు ప్రాజెక్ట్ కే షూటింగ్ లలో బిజిగా ఉన్నారు. ఓం రౌత్ దర్శకత్వం లో తెరకెక్కుతున్న ఆది పురుష్ చిత్రం షూటింగ్ ను పూర్తి చేశారు. ప్రభాస్ హీరోగా రాధా కృష్ణ కుమార్ దర్శకత్వం లో తెరకెక్కిన రాధే శ్యామ్ చిత్రం వచ్చే ఏడాది జనవరి 14 వ తేదీన విడుదల కి సిద్దం అవుతోంది. ప్రభాస్ చేస్తున్న సినిమాలు, తీసుకుంటున్న పారితోషికాలతో ఇండియా లోనే నంబర్ వన్ హీరో అనడం లో ఎలాంటి సందేహం లేదు.

## ఆచార్య నుంచి ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఇదేనా..?



టాలీవుడ్ లెజెండరీ హీరో మెగాస్టార్ చిరంజీవి హీరోగా కాజల్ అగర్వాల్ హీరోయిన్ గా బ్లాక్ బస్టర్ దర్శకుడు కొరటాల శివ తెరకెక్కించిన భారీ సినిమా "ఆచార్య". మెగా ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఈ భారీ సినిమాని నార్మల్ కంటే ఓ మెగా మల్టీస్టారర్ అని చెప్పాలి. ఎందుకంటే ఈ సినిమాలో అనుకున్న దానికంటే ఎక్కువగా మెగా తనయుడు మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ పాత్ర వచ్చింది. మరి ఇదిలా ఉండగా చిత్ర యూనిట్ ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ సిద్ధ పై ఇస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు. మరి అదేంటో ఇప్పుడు తెలుస్తోంది. దీని ప్రకారం మేకర్స్ ఈసారి చరణ్ చేసిన సిద్ధుడి పాత్రపై టీజర్ ని రిలీజ్ చెయ్యబోతున్నారట. దానిపైనే ఈరోజు అప్డేట్ ఉండొచ్చని సినీ వర్గాల్లో టాక్. మరి అదేనా కాదా అనేది వేచి చూడాలి. ఇక చరణ్ సరసన పూజా హెగ్డే హీరోయిన్ గా నటించగా మణిశర్మ సంగీతం అందించిన సంగతి అందరికీ తెలిసిందే. అలాగే మ్యాట్నీ ఎంటర్టైన్మెంట్స్ వారు ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో నిర్మాణం వహించారు.

## భీమ్లా నాయక్ లో పవన్ సాంగ్..?

పవన్ కళ్యాణ్ హీరోగా సాగర్ కే చంద్ర దర్శకత్వం లో తెరకెక్కుతున్న తాజా చిత్రం భీమ్లా నాయక్. ఈ చిత్రం లో రానా దగ్గుపాటి మరొక హీరోగా నటిస్తున్నారు. సాగర్ కే చంద్ర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ మాటలు అందిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్ పై ఈ చిత్రాన్ని సూర్య దేవర నాగ వంశీ నిర్మిస్తున్నారు.తాజాగా ఈ చిత్ర సంగీత దర్శకుడు థమన్ మీడియా తో ఇంటరాక్ట్ అయ్యారు. అయితే భీమ్లా నాయక్ చిత్రం ల్ పవన్ కళ్యాణ్ పై పాట గురించి అడగగా, దీని గురించి మీరు త్వరలో తెలుసుకుంటారు అంటూ చెప్పుకొచ్చారు థమన్. పవన్ కళ్యాణ్ ఇదివరకే కొన్ని చిత్రాల్లో పాటలు పాడారు. రీసెంట్ గా అత్తారింటికి దారేది చిత్రం లో కాటమ రాయుడా, అజ్ఞాతవాసి చిత్రం లో మరొక పాటతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు. అయితే భీమ్లా నాయక్ లాంటి మాస్ చిత్రం లో పవన్ కళ్యాణ్ పాడితే సినిమా వేరే లెవెల్ కి పోతుంది అంటూ పవన్ కళ్యాణ్ అభిమానులు ఆశిస్తున్నారు. అయితే దీని పై త్వరలో క్లారిటీ రానుంది. నిత్యా మీనన్, సంయుక్త లు హీరోయిన్స్ గా నటిస్తున్న ఈ చిత్రం ను వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో దింపేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తుంది.




Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989